


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 49, పేజీలు - 08

బుధవారం, జులై 23, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## 11వేల యూట్యూబ్ ఛానళ్లపై గూగుల్ వేటు

**- రష్యా, చైనావే అధికం**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అసత్య ప్రచారాలను వ్యాప్తి చేస్తున్నాయనే కారణంతో వివిధ దేశాలకు చెందిన సుమారు 11 వేల యూట్యూబ్ ఛానళ్లను తాజాగా గూగుల్ తొలగించింది. వీటిలో చైనా, రష్యాకు చెందిన ఛానళ్లు అధికంగా ఉన్నట్లు వెల్లడించింది. ఇలా వేటు పడిన వాటిలో ఒక్క చైనాకు చెందినవే 7,700 ఉన్నట్లు గూగుల్ పేర్కొంది. అవి భారత్‌లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా పార్టీకి సంబంధించి ప్రచారాలు చేస్తున్నట్లు గుర్తించింది.

2లో..

## సర్పంచ్ ఎన్నికల్లో నోటా

**- ఎన్నికల సంఘం కీలక నిర్ణయం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో మనకు ఎవరూ నచ్చకపోతే నోటాకు ఓటు వేసే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు ఈవీఎంలలో మాత్రమే నోటాకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. కానీ ఇకపై బ్యాలెట్ పేపర్ల మీద కూడా నోటాను ముద్రించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

2లో..

## హెచ్‌సీఏ విషయంలో దుష్ప్రచారం చేయవద్దు

**- సీఐడీ అధికారిణి చారుసిన్హా**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కేసు విషయంలో దుష్ప్రచారం చేయవద్దని తెలంగాణ సీఐడీ అడిషనల్ డీజీపీ చారుసిన్హా మీడియాకు విజ్ఞప్తి చేశారు. ఓటింగ్ విషయంలో ఐఏఎస్, ఐపీఎస్‌లపై అసత్య ప్రచారం చేయవద్దని ఆమె కోరారు. కేసు సంబంధిత సమాచారాన్ని సీఐడీ అధికారికంగా విడుదల చేస్తుందని ఆమె వెల్లడించారు. అసత్య ప్రచారాలు

2లో..

## రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు

- రేవంత్ రెడ్డి ఫ్లైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా
- ఢిల్లీకి వెళ్లడంలో అర్ధ సెంచరీ సాధించారన్న కవిత
- బీసీ రిజర్వేషన్లపై జాతీయ పార్టీలుం మోసం చేస్తున్నాయని ఆగ్రహం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఫ్లైట్ మోడ్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఆయన ఈ రోజు కూడా ఢిల్లీకి వెళుతున్నారని, దేశ రాజధానికి వెళ్లడంలో ఆయన ఇప్పటికే అర్ధ సెంచరీ సాధించారని వ్యంగ్యం ప్రదర్శించారు. ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లపై మాత్రం

2లో..

## స్థానిక సమరానికి పార్టీలు సిద్ధం

**- రాజకీయ పార్టీల అడుగులు వ్యూహాత్మకం**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు మొదలవుతున్నాయి. రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఇప్పటికే క్షేత్రస్థాయిలో అన్ని పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. ఈసారి తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్తు రాజకీయాలను నిర్ణయిస్తాయని భావిస్తున్న క్రమంలో ప్రధాన పార్టీలన్నీ ప్రత్యేకమైన దృష్టి సారించాయి.

### స్థానిక సంస్థల ఎన్నికలకు వ్యూహాలు

తెలంగాణలో ప్రస్తుతం అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్ ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బిఆర్ఎస్, బిజెపి తమ బలాన్ని నిరూపించుకోవడానికి ఈ ఎన్నికలను వేదికగా చేసుకున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా గ్రామపంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రజాప్రతినిధులను ఎన్నుకోవలసి ఉంటుంది.

ఈ ఎన్నికలలో విజయం సాధించడం ద్వారా పార్టీలకు క్షేత్రస్థాయిలో తమ సంస్థాగత బలాన్ని పెంచుకోవాలని భావిస్తున్నాయి.

### కాంగ్రెస్ వ్యూహమిదే

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు ఎవరికి వారు వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల హవాను ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కొనసాగించాలని భావిస్తోంది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి నియోజకవర్గాల వారీగా సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ కార్యాచరణ రూపొందిస్తోంది.

### సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్ళాలని కాంగ్రెస్

అంతేకాకుండా ప్రభుత్వం అందిస్తున్నటువంటి సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లి ప్రజా మద్దతును పొందాలని ప్రయత్నం చేస్తుంది. మరోవైపు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయం, తమకు ఈ ఎన్నికలలో కలిసి వస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. ఇక 2023 అసెంబ్లీ, 2024 లోక్సభ ఎన్నికల ఓటమి తర్వాత బీఆర్ఎస్ అస్తిత్వ పోరాటంలో పడింది.

### అస్తిత్వ పోరాటంలో బీఆర్ఎస్

ఈ స్థానిక సంస్థల ఎన్నికలు బిఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తును తేల్చనున్న నేపథ్యంలో ఈ ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. 2016, 2021 స్థానిక సంస్థల ఎన్నికలలో ఆధిపత్యం చెలాయించిన బీఆర్ఎస్, ఈ దఫా ఎన్నికలలో కూడా తన సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది.

2లో..

## ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

**- ధన్ ఖడ్ కు ఆరోగ్యం చేకూరాలని మోడీ ఆకాంక్ష**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. ఆయన రాజీనామా వెంటనే అమలులోకి వస్తుందని ప్రకటించారు. ఈ మేరకు ధన్ ఖడ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు సంతకం చేసి లేఖను హోంశాఖకు పంపించారు. కాగా, సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాగా చైర్మన్ హోదాలో జగదీప్ ధన్ ఖడ్ రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు. తొలిరోజు కార్యకలాపాలు ముగిసి సభ మంగళవారానికి వాయిదా పడిన తర్వాత ధన్ ఖడ్ తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్ల ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన రాజీనామా లేఖను సమర్పించారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని రాష్ట్రపతిని కోరారు. కాగా, ఉపరాష్ట్రపతితో పాటు

2లో..

## మారిన బాబు

**- చంద్రబాబులో పెనుమార్పునకు కారణాలేంటి?**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజంగా గతం కంటే భిన్నంగా వ్యవహరిస్తున్నారు. గతంలోమూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో అంతా తానే అయి వ్యవహరించేవారు. ఆయన కూడా ఇతర రాజకీయ నేతల మాదిరిగానే వ్యవహరించేవారు. చంద్రబాబు పై ఒక అపవాదు కూడా ఉండేది. ఎక్కువగా అధికారులపైనే ఆధారపడి పాలన చేస్తారని. అధికారుల ఫీడ్ బ్యాక్ ప్రకారమే నడచుకుంటారనే వారు. నిజానికి అందులో నిజం లేకపోలేదు. 1995 లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు అయిన నాటి నుంచి 1999లో, 2014లో గాని అధికారులే చంద్రబాబు పాలనలో ఎక్కువగా పెత్తనం చెలాయించేవారు. ఎన్నికయిన ప్రజాప్రతినిధులు నామమాత్రంగా ఉండేవారు.

### అధికారులపైనే..

ప్రజలు ఏమనుకుంటున్నారన్న ఫీడ్ బ్యాక్ ను కూడా అధికారుల నుంచి తీసుకునే వారు. అందుకే తరచూ ఆయన గతంలో కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేవారు. వారంలో ఒకరోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ రాష్ట్రంలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే వారు. ఇటు జిల్లా కలెక్టర్లు, అటు ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు చెప్పిన మాటలనే చెవికి ఎక్కించుకునే వారు. క్షేత్రస్థాయిలో తిరిగే నేతలను పెద్దగా పట్టించుకునే వారు కారు. వారితో సమావేశమ

2లో..

## ఆ ఇద్దరే..

**- మిగతా నేతలంతా సైలెంట్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో అపోజిషన్ బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అంటోంది. పార్టీ మిద, అతినేత మిద వస్తున్న విమర్శలు, ఆరోపణలను ఎదుర్కోవడంలో అయినా ప్రభుత్వ వైఫల్యాల మిదా ప్రశ్నించడంలో అయినా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు ముందుంటున్నారు. అయితే పదేళ్లు పవర్‌లో ఉన్నప్పుడు అధికారం అనుభవించిన చాలా మంది బీఆర్ఎస్ ముఖ్య నేతలెవరు తమంతట తాముగా

2లో..

## తెలంగాణకు రెడ్ అలెర్ట్

**- మూడురోజులు భారీవర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు

2లో..

## బీసీ వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం

**- బీజేపీ ఎంపీలకు మంత్రి పొన్నం వార్నింగ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు చేసిన వ్యాఖ్యలపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి 9వ షెడ్యూల్‌లో చేర్చడం అసాధ్యమన్న బీజేపీ వాదనను మంత్రి తీవ్రంగా ఖండించారు.

2లో..

## లీగల్ నోటీసులకు భయపడే వ్యక్తిని కాదు

**- రామచందర్ రావు నోటీసులపై భట్టి విక్రమార్క రియాక్షన్**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీజేపీ తెలంగాణా అధ్యక్షుడు రామచందర్ రావు పంపిన లీగల్ నోటీసులపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పందించారు. భట్టి విక్రమార్క లీగల్ నోటీసులకు భయపడే వ్యక్తి కాదన్నారు. సమయం వచ్చినప్పుడు పార్టీగా, వ్యక్తిగా లీగల్ నోటిసుకు ఎలా సమాధానం చెప్పాలో ఆ విధంగా చెబుతానని భట్టి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు దళితులు, బీసీలు, మైనార్టీలు

2లో..

## తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణం

2లో..

- టీటీడీ పాలకమండలి సమావేశంలో కీలక నిర్ణయాలు
- ఒంటిమిట్ట రామాలయంలో అన్న ప్రసాదాల కోసం రూ.4.35 కోట్లు
- 142 మంది కాంట్రాక్టు డ్రైవర్ల క్రమబద్ధీకరణ



## శాటిలైట్ సర్వే ద్వారా పంట వివరాల సేకరణ

- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- వ్యవసాయం, అనుబంధ రంగాలపై సమీక్ష
- నాలుగు గంటల పాటు లోతైన చర్చ
- సమాచారాన్ని క్షేత్రస్థాయి డేటాతో సరిపోల్చాలని సూచన



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమగ్ర చర్యలు చేపట్టారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన శాటిలైట్ సర్వే ద్వారా పంటల వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం భలభద్రాపురంలో చేపట్టిన శాటిలైట్ సర్వే ఫలితాలు సమగ్ర సమాచారాన్ని అందించాయని, ఈ సమాచారాన్ని క్షేత్రస్థాయి డేటాతో సరిపోల్చాలని సూచించారు. ఒకే ప్రాంతంలో ఒకే తరహా పంటల సాగుకు రైతులకు మార్గదర్శనం అందించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా నిరంతర సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ల్యాండ్ రీసర్వే తర్వాత రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనతో పాటు వ్యవసాయ రికార్డుల నవీకరణ

2లో..

# 11వేల యూట్యూబ్ ఛానళ్లపై గూగుల్ వేటు

ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రశంసిస్తూ కంటెంట్‌ను పోస్టు చేస్తున్నట్లు తెలిపింది. అలాగే రష్యాకు చెందిన 2 వేలకు పైగా యూట్యూబ్ ఛానళ్లను తొలగించినట్లు వెల్లడించింది. నాటో, ఉక్రెయిన్‌లను విమర్శిస్తూ రష్యాకు మద్దతుగా సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు గుర్తించామని గూగుల్ పేర్కొంది. అంతేగాక రష్యాలోని పలు సంస్థలకు సైతం ఈ ఛానళ్లతో సంబంధాలు ఉన్నట్లు తెలిపింది. చైనా, రష్యాతో పాటు ఇజ్రాయెల్, తుర్కియే, ఇరాన్, ఘనా, అజర్‌బైజాన్, రొమేనియాకు చెందిన యూట్యూబ్ ఛానళ్లను కూడా తొలగించినట్లు వెల్లడించింది. ఆయా దేశాలకు చెందిన యూట్యూబ్ ఛానళ్లు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా, శాంతి భద్రతాలకు విఘాతం కలిగించేలా నిరాధార వార్తలు, కంటెంట్‌ను ప్రచారం చేస్తున్నందున చర్యలు తీసుకున్నట్లు గూగుల్ స్పష్టం చేసింది.

# సర్పంచ్ ఎన్నికల్లో నోటా

త్వరలోనే తెలంగాణలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల నుంచే బ్యాలెట్ పత్రాల్లో నోటా అందుబాటులోకి రానుంది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం నిర్వహించబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను బ్యాలెట్ ద్వారానే నిర్వహిస్తుండగా దీనిలో నోటాను ముద్రించేలా ఎన్నికలు సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే అధికారులు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. పోలింగ్ బాక్సులు, సిబ్బంది నియామకం వంటి అంశాలు ఓ కొలిక్కి వచ్చాయి. ఈసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు ఒకేసారి నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

ఈక్రమంలో జడ్పీటీసీ కోసం తెలుపు రంగులో, ఎంపీటీసీల కోసం గులాబీ రంగులోసభ్యుల బ్యాలెట్ ఉండేలా ప్రింటింగ్ ఏర్పాట్లు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలపై స్పష్టత వచ్చింది. అలానే నియోజకవర్గాల వారీగా ఓటర్ల విభజన పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారితో పాటు మరో నలుగురు సిబ్బందిని నియమిస్తూ వారికి శిక్షణ ఇచ్చే ప్రక్రియ కూడా మొదలుపెట్టారు. అలానే ఓటరు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఇద్దరు సభ్యులకు ఒకే రోజు ఓటు వేయాల్సి ఉంది. దీనిలో భాగంగా ముందుగా ఓటరుకు ఎంపీటీసీ అభ్యర్థికి ఓటు వేసేలా బ్యాలెట్ ఇస్తారు. ఆ తరువాత అదే గదిలో జడ్పీటీసీ క్యాండెట్‌కు ఓటు వేసేందుకు బ్యాలెట్ పత్రం అందిస్తారు. ఇలా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఇద్దరు అభ్యర్థులకు రెండు ఓట్లు వేశాకే.. ఓటరు పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్‌లో పోటీ చేసే అభ్యర్థి వయసు 21ఏళు నిండి ఉండాలి. పోటీకి కనీసం ఒకరోజు ముందే బ్యాంకు అకౌంట్ తెరవాలి. ఆ ఖాతా నుంచే ఎన్నికలకు సంబంధించిన ఖర్చులు చేస్తున్నట్లుగా సదరు అభ్యర్థి నామినేషన్ వేసిన రోజున రిటర్నింగ్ అధికారికి రాతపూర్వకంగా తెలపాలి. 2018 పంచాయతీరాజ్ చట్టం 243(3) ప్రకారం ఒక అభ్యర్థి ఎంపీటీసీ, జడ్పీటీసీకి పోటీ చేస్తున్న స్థానాలు ఒకటి కంటే ఎక్కువ ఉండరాదు. ఎవరైనా అభ్యర్థి రెండు చోట్ల పోటీ చేస్తున్నట్లు గుర్తిస్తే వారి నామినేషన్లను రెండు చోట్ల తిరస్కరించే అవకాశం ఉంటుంది.

# హెచ్‌సీఏ విషయంలో దుష్ప్రచారం చేయవద్దు

చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఏ కేసులో అధ్యక్షుడు జగన్మోహన్ రావు, ట్రెజరర్ శ్రీనివాసరావు, సీఈవో సునీల్, అధికారి రాజేందర్ యాదవ్, ఎమ్మెల్సీ కవితపై ఆరోపణలు ఉన్నాయి. వీరంతా 23 ఇన్ స్టిట్యూషనల్ ఓట్లను అక్రమంగా వేయించినట్లు సీఐడీ గుర్తించింది. అయితే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఓటింగులో పాల్గొన్నారన్న ఆరోపణలను చారుసిన్హా ఖండించారు.

# రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించే ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి గట్టిగా మాట్లాడాలని సూచించారు. హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పారని, అయితే బీసీలు పార్టీల పరంగా రిజర్వేషన్లు కోరుకోవడం లేదని తెలిపారు.

చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను వారు కోరుకుంటున్నారని తెలిపారు. రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే బీసీ బిడ్డలు వారిని వదిలి పెట్టరని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై రెండు జాతీయ పార్టీలు మోసం చేస్తున్నాయని కవిత ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడుతున్న మాటలు బాధాకరమని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పాస్ చేసి గతంలోనే పంపించినప్పటికీ రాష్ట్రపతి వద్ద పెండింగులో పెట్టి తిరిగి పంపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లుకు మతపరమైన రంగు పులిమి బీజేపీ బిల్లును పాస్ చేయడం లేదని విమర్శించారు. గుజరాత్‌లో ఎలాంటి రిజర్వేషన్లు ఇచ్చారో అందరికీ తెలుసని, తెలంగాణ విషయంలో మాత్రం బీజేపీ మరో రకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ 50 శాతానికి పైగా రిజర్వేషన్లను అమలు చేస్తోందని కవిత వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి న్యాయస్థానాల పరిధిలో ఉందని సాకులు చెబుతోందని విమర్శించారు. బీసీ బిడ్డలను రిజర్వేషన్లకు దూరంగా ఉంచాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

# స్థానిక సమరానికి పార్టీలు సిద్ధం

ఈ మేరకు నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో సభలు సమావేశాలు నిర్వహిస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

### ఆ ప్లాన్ తో ఎన్నికలకు వెళ్లాలని బీఆర్ఎస్, బీజేపీ

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చి స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలను రచిస్తున్నారు. ఇక బిజెపి లోక్సభ ఎన్నికలలో తన సత్తా చాటి తెలంగాణ రాష్ట్రంలో తన పట్టును చూపించిన వేళ, గ్రామీణ స్థాయిలో కూడా సంస్థాగతంగా బలం పెంచుకోవడానికి స్థానిక సంస్థల ఎన్నికలు గొప్ప అవకాశంగా భావిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ ఇమేజ్ తో పాటు, గ్రామీణ ప్రాంతాలలో సంస్థాగతంగా బలం పుంజుకోవడానికి సమావేశాలు, కార్యశాలలు నిర్వహిస్తూ ఎన్నికలకు సిద్ధమవుతోంది.

# ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

పలు పదవులు నిర్వర్తించిన జగదీప్ ధన్ ఖడ్ దేశానికి ఎంతో సేవలందించారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం తెలిపిన తర్వాత ప్రధాని మోదీ ఈ మేరకు ట్వీట్ చేశారు. ఈ రాజీనామాతో ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అవ్వడంతో.. త్వరలోనే కొత్త ఉపరాష్ట్రపతి ఎన్నికకు రంగం సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ కూడా రాబోతుంది.

# మారిన బాబు

య్యేందుకు కూడా ఇష్టపడే వారు. వారికి సమయం కూడా కేటాయించే వారు కాదు. దీంతో తమకు కావాల్సిన పనులు చేయించుకోవడానికి ముఖ్యమంత్రి కార్యాలయం పైనే ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆధారపడే వారు.

### ఎమ్మెల్యేలతో ముఖాముఖి..

2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా అదే పరిస్థితి తలెత్తింది. అనేక మంది పార్టీ నుంచి వెళ్లిపోయిన ఎమ్మెల్యేలు తమను కలిసేందుకు కూడా చంద్రబాబు సమయం ఇచ్చేవారు కాదంటూ విమర్శలు చేశారు. కానీ 2024 ఎన్నికల తర్వాత చంద్రబాబు లో పెను మార్పు కనిపిస్తుంది. తరచూ ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. పార్టీ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబు వరస భేటీలు జరుపుతున్నారు.

ఈరోజు నరసరావుపేట, పాతపట్నం ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశం కానున్నారు. రోజువారీ షెడ్యూల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ రోజుకు ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సమావేశమవుతున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు.

### కార్యకర్తలతో సమావేశాలు..

ఇప్పటివరకు పద్దెనిమిది మంది ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం, నియోజకవర్గంలో సమస్యలు-పరిష్కారాలు, పార్టీ పదవులపై వంటి ప్రధాన అంశాలు అజెండాగా భేటీ జరగనుంది.

నియోజకవర్గాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరుగుతున్న తీరు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను కూడా అడిగి తెలుసుకుంటున్నారు. అదే సమయంలో జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ఖచ్చితంగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు.

కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వారికి అండగా నిలబడతానని భరోసా ఇస్తున్నారు. మరొకవైపు లోకేశ్ కూడా కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తుండంతో 2024 తర్వాత చంద్రబాబు పాలనలో పెనుమార్పులు జరిగినట్లు కనపడుతుంది.

# ఆ ఇద్దరే..

ఏ కార్యక్రమం చేయడం లేదట. పార్టీ నేతలకు, క్యాడర్‌కు ఏ ఇబ్బందులు వచ్చినా, అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి వేధింపులు ఎదురైనా కేటీఆర్, హరీశ్‌రావు తప్ప మిగతా ముఖ్య నేతలు పెద్దగా స్పందించడం లేదట. తమ తమ జిల్లాల్లో జరుగుతున్న సంఘటనలపై కూడా పైనుంచి ఆదేశాలు వచ్చే వరకు మనకెందుకులే అన్న ధోరణితో ఉంటున్నారట బీఆర్ఎస్ కీలక లీడర్లు. మల్కాజ్‌గిరిలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వివాదం చెలరేగింది. బోనాల పండగ చెక్కుల పంపిణీలో ప్రోటోకాల్ రగడ కాస్త ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ సునీత భర్త రాము యాదవ్‌పై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు దాడి చేశారని అంటున్నారు. తమ పార్టీ నేతపై దాడి జరిగిందన్న విషయం తెలుకున్న వెంటనే ఖమ్మం పర్యటనలో ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా మల్కాజ్‌గిరిలోని కార్పొరేటల్ సునీత ఇంటికి వెళ్లి ఆమె భర్త రాము యాదవ్‌ను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అయితే తమ పార్టీ నేతపై కాంగ్రెస్ లీడర్లు దాడి చేశారన్న విషయం తెలిసినా హైదరాబాద్‌లోని పార్టీ ముఖ్యనేతలు సైలెంట్ గా ఉండిపోయారట. కనీసం ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదట. కానీ కేటీఆర్ వెళ్లి వాళ్లను పరామర్శించి వచ్చాక అప్పుడు హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలు మేల్కొన్నారట. అది కూడా కేటీఆర్ చెబితే కానీ హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలు కదలలేదని తెలుస్తోంది. మన పార్టీ నేతలపై దాడి జరిగితే ఎందుకు స్పందించలేదని కేటీఆర్ వారిని ప్రశ్నించినట్లు తెలంగాణ భవన్ వర్గాల టాక్. అందులోనూ బీసీ వర్గం నేతపై దాడి జరిగితే కనీసం పార్టీలోని ఆ సామాజికవర్గం నేతలు కూడా స్పందించరా అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కేటీఆర్ చెప్పిన తర్వాత మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్ తదితరులు అప్పుడు మల్కాజ్‌గిరికి వెళ్లి దాడిలో గాయపడ్డ కార్పొరేటర్ సునీత భర్త రాము యాదవ్‌ను పరామర్శించారని తెలుస్తోంది. ఇదే పని ముందు చేసి ఉంటే బాగుండేదన్న చర్చ పార్టీలో జరుగుతోంది. ఈ ఒక్క ఇష్యూలోనే కాదు చాలా అంశాల్లో, చాలా సందర్భాల్లో కేటీఆర్, హరీశ్‌రావులు మినహా మిగతా ముఖ్యనేతలంతా తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న చర్చ బీఆర్ఎస్ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై వేధింపులు ఎక్కువయ్యాయని వాపోతోంది క్యాడర్. పార్టీ నేతలపై దాడులు, అక్రమ కేసులు పెట్టినా మిగతా నేతలు పెద్దగా స్పందించడం లేదని అంటున్నారు. అప్పుడు కూడా కేటీఆర్ లేదంటే హరీశ్‌రావులు చెబితే తప్ప ముఖ్య నేతలెవ్వరు రెస్పాండ్ కావడం లేదని చెబుతున్నారు. ఇలా ప్రతిసారి పైనుంచి ఆదేశాలు వస్తేనో అధిష్టానం చెబితేనో తప్ప మిగతా సందర్భాల్లో తమకెందుకులే అని పట్టీపట్టనట్లు ఉంటున్నారట బీఆర్ఎస్ నేతలు. అధికార కాంగ్రెస్, బీజేపీ నుంచి పార్టీ అధినేత కేసీఆర్ లేదంటే మిగతా వారిపై విమర్శలు, ఆరోపణలు చేసిన సందర్భాల్లోను పైనుంచి చెబితే ముఖ్యనేతలు రియాక్ట్ కావడం లేదని లేదని తెలుస్తోంది. ఇలా అన్నీ కేటీఆర్, హరీశ్‌రావులే చూసుకోవాలంటే కష్టమేనని, అన్నింటికీ వాళ్లే స్పందించాలంటే అయ్యే పని కాదని పార్టీ ముఖ్య నేతల్లో మార్పు రావాలన్న టాక్ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.

# తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణం

తిరుమల (ప్రశ్న న్యూస్) తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో టీటీడీ పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకోగా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఈ వివరాలను వెల్లడించారు. ఈ క్రమంలోనే ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయంలో భక్తులకు నిత్యాన్నదానం అమలు చేయాలని నిర్ణయించారు. ఒంటిమిట్టకు వచ్చే భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందజేసేందుకు రూ.4.35 కోట్లు కేటాయింపునకు టీటీడీ పాలకమండలి ఆమోదం తెలిపింది. మరోవైపు ఒంటిమిట్టలో పూర్తిస్థాయి అన్నప్రసాదాల పంపిణీకి టీటీడీ ఇప్పటికే చర్యలు మొదలుపెట్టింది. టీటీడీ ఈవో శ్యామలరావు ఈ విషయమై జూలై నెలలోనే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒంటమిట్టలో భక్తులకు నిత్యాన్నదానం అమలు చేయాలని సీఎం చంద్రబాబు టీటీడీ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీటీడీ ఈ అంశం మీద స్పెషల్ ఫోకస్ పెట్టింది. తిరుమల తరహాలో ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలోనూ భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఆగస్ట్ నెల నుంచి ఈ విధానం అమలు చేయాలని టీటీడీ భావిస్తోంది. ఇందుకోసం ఆలయం వద్ద తాత్కలికంగా జర్మన్ షెడ్స్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఒంటమిట్టలో అన్నప్రసాదాలు పంపిణీ కోసం అవసరమైన వంటసామాగ్రి, సదుపాయాలు, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని టీటీడీ ఇప్పటికే అధికారులను ఆదేశించింది. మరోవైపు ఏపీలో పలు చారిత్రక వైభవం కలిగిన ఎన్నో పురాతన ఆలయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ముఖ్యమైన ఆలయాల్లో నిత్యాన్నదాన పథకం అమలు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఇప్పటికే ఆదేశించారు. ప్రస్తుతం తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, శ్రీశైలం మల్లన్న ఆలయం, సింహాచలం అప్పన్న ఆలయం వంటి చోట్ల మాత్రమే నిత్యాన్నదాన పథకం అమలు చేస్తున్నారు. అయితే వీటితో పాటుగా రాష్ట్రంలోని మరో 16 ప్రధాన ఆలయాల్లోనూ అన్నదానం అమలు చేయాలన్న చంద్రబాబు.. రుచి, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలోనే ఆగస్ట్ నుంచి ఒంటిమిట్టలో నిత్యాన్నదానం అమలు చేసేందుకు టీటీడీ చర్యలు చేపడుతోంది.

# లీగల్ నోటీసులకు భయపడే వ్యక్తిని కాదు

అంటే చిన్న చూపు ఉందన్నారు. దేశంలో ఈ వర్గాలకు మేలు జరుగుతుంటే ఆయన పదేపదే అడ్డుపడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రామచంద్ర రావు పాత్ర ఏంటో అందరికీ తెలుసని భట్టి అన్నారు. హెచ్ సీ యూ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యోదంతంపై భట్టి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ఇటీవల లీగల్ నోటీసు జారీ చేసిన సంగతి తెలిసిందే. తనపై చేసిన ఆరోపణలపై మూడు రోజుల్లోగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే రూ. 25 కోట్ల పరువునష్టం, క్రిమినల్ కేసులు కూడా ఎదుర్కోవలసి ఉంటుందని రామచందర్ రావు తన నోటీసుల్లో పేర్కొన్న నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి స్పందించారు. హైదరాబాద్ సెక్రటేరియట్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. కులగణన సర్వే అవసరం లేదన్న మోదీని జనగణనతో పాటు కుల గణన కూడా చేస్తామని నిర్ణయం తీసుకునేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా, విజయవంతంగా కులగణన సర్వే పూర్తి చేసిందని భట్టి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేకి ముందు సర్వేకి తర్వాత అనే చర్చ దేశవ్యాప్తంగా జరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే చారిత్రాత్మకమైనదిగా చెప్పారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, లోక్ సభ, రాజ్యసభ ఎంపీల మద్దతు కూడగట్టేందుకు ఢిల్లీకి వెళ్తున్నట్లు చెప్పారు. బీసీ బిల్లును త్వరితగతిన పార్లమెంట్లో ప్రవేశపెట్టి మద్దతు కూడగట్టడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి చెందిన 100 మంది ఎంపీలు కూడా కలిసి వస్తారన్నారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే కుల గణన చేపడుతామని తమ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ప్రకటించారని, ఆ మేరకు విజయవంతంగా కుల గణన పూర్తి చేసి కేబినెట్ లో, ఆ తర్వాత అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదింపజేశామన్నారు. కుల గణనలో తెలంగాణ దేశానికి ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందని, దేశంలోని ఏ రాష్ట్రం అయినా కులగణన చేపట్టాలంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అనుసరించాల్సిందేనని భట్టి అన్నారు. గతంలో దేశంలో చేపట్టిన వివిధ రకాల సర్వేలు, వారి అనుభవాలు పరిగణలోకి తీసుకున్నామన్నారు. సర్వేకు సంబంధించిన ప్రశ్నావళి తయారీ విధానం, జిల్లా, రాష్ట్రస్థాయిలో భాగస్వాములు అందరినీ సర్వేకు ముందే సమావేశపరిచి వారి అభిప్రాయాలను తీసుకుని ముందుకు వెళ్ళామన్నారు. ప్రతి 150 ఇళ్లకు ఒక బ్లాక్, ప్రతి బ్లాక్ కు ఒక అధికారిని నియమించామని, పూర్తిగా ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో సర్వే జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేకు అసెంబ్లీలోనే బీజేపీ, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా మద్దతు ఇచ్చారన్నారు. అదేవిధంగా పార్లమెంటులో కూడా పార్టీలకతీతంగా బీసీ బిల్లుకు మద్దతు ఇస్తారని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తున్నట్లు చెప్పారు. యాభై శాతం రిజర్వేషన్ల క్యాప్ ను తొలగించకపోతే భవిష్యత్తులో ఇబ్బంది కలుగుతుందని ఆర్డినెన్స్ తీసుకు వచ్చామని, ఆర్డినెన్స్ కు గవర్నర్ ఆమోదముద్ర వేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. రిజర్వేషన్ల బిల్లు మేమే తెచ్చాం, మేమే పరిష్కరించుకోవాలని బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటించారని, ఆయన విషయాన్ని సరిగా అవగాహన చేసుకోలేదని భావిస్తున్నట్లు భట్టి చెప్పారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు అనేది కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అంశమని, రాజకీయ పార్టీలకు సంబంధించింది కాదన్నారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన వాళ్ళు అన్నీ గాలికి వదిలేశారని, తమకు నిబద్ధత ఉంది కాబట్టే ప్రణాళికా ప్రకారం ముందుకు వెళుతున్నట్లు భట్టి పేర్కొన్నారు.

# ఆర్థిక ఇబ్బందుల్లో గ్రామ కార్యదర్శులు : బెల్లంకొండ

**కోదాడ జూలై** ఆర్థిక ఇబ్బందుల్లో గ్రామ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారని దినదిన గండంగా విధి నిర్వహణలో ఉన్నారని సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ఆవేదన వెలిబుచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలలో మోటర్లు కాలిపోయిన, వీధిలైట్లు వెలగకపోయినా,పారిశుద్ధ్య పనులను అప్పులు చేసి పనులు చేస్తున్నారని గత 17 నెలలుగా ఒక్కొక్క గ్రామ కార్యదర్శి సుమారుగా 2 లక్షల రూపాయల పైనే పెట్టుబడి పెట్టినట్టు గ్రామ కార్యదర్శిలు తెలిపారన్నారు.

గ్రామాలలో ఇంటి పన్ను వసూలు చేసి ట్రెజరీలలో జమ చేసిన డబ్బులు కూడా డ్రా చేసే పరిస్థితి లేదని మళ్లీ గ్రామాలలో అభివృద్ధి పనులకు పెట్టుబడి పెట్టే పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, కుక్కల బెడద తీవ్రంగా ఉందని ప్రతి గ్రామంలో అనేకమంది కుక్కకాటుకు గురవుతున్నారని పసి పిల్లలని, గొర్రెలని, మేకలను చంపేస్తున్నాయని కుక్కల బెడద నివారించాలని కోరారు.

# తెలంగాణకు రెడ్ అలెర్ట్

జారీ చేసింది. వచ్చే మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాలకు రెడ్ అలెర్ట్ ను జారీ చేసింది. ఎన్నింటికి ఆరెంజ్ అలర్ట్, ఇంకొన్నిటికి ఎల్లో అలర్ట్ ను జారీ చేసింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలుగు రాష్ట్రాలలో వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసినట్టు వాతావరణశాఖ సంచాలకురాలు డాక్టర్ నాగరత్న వెల్లడించారు. తెలంగాణలో ఈ నెల 26వ తేదీ వరకు భారీవర్షాలు కురవనన్న నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే మంగళవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాలలో అతి భారీ నుండి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. అలాగే అదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలర్ట్ ను జారీ చేసింది. హన్మకొండ, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జనగామ, సిద్దిపేట, మెదక్ జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ ను జారీ చేసింది. కాగా రేపు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, కొత్తగూడెం, ములుగు జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని, ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే జూలై 24, 26 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలలో తేలికపాటి నుండి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

# బీసీ వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం

బీజేపీ మరోసారి బీసీల పట్ల తన అసలు స్వభావాన్ని, కుట్రను బయటపెట్టిందని ఆయన ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గతంలో పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో ఇది జరిగిందని గుర్తు చేశారు. 'తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి. ఎందుకు రిజర్వేషన్లు అమలు కావో చూస్తాం. రాజీనామా చేయకుంటే రిజర్వేషన్లు సాధించి పెట్టండి.' అని బీజేపీకి సవాల్ విసిరారు. సుప్రీంకోర్టు ఇందిరా సహానీ కేసులో రాష్ట్రాలకు ప్రామాణికమైన ఎంపెరికల్ డేటా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టంగా చెప్పిందని మంత్రి గుర్తు చేశారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసి కేబినెట్, శాసనసభ, గవర్నర్ ఆమోదంతో ఈ ప్రతిపాదనను ఢిల్లీకి పంపిందని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని బరాబర్ రిజర్వేషన్లు అధికారికంగా అమలు చేస్తామన్నారు. అనాడు మండల కమిషన్ తీసుకొస్తే "కమండల్" అన్నది బీజేపీనేని ఎద్దేవా చేశారు. మళ్లీ బీజేపీ తమ వక్ర బుద్ధిని, బీసీల పట్ల కుట్రను బయటపెట్టిందని విమర్శించారు. తెలంగాణలోని అన్ని బీసీ వర్గాలు, కుల సంఘాలు బీజేపీ నిజస్వరూపాన్ని గమనించి రిజర్వేషన్ల ప్రక్రియను కాపాడుకునే దానిలో ముందుండాలని మంత్రి పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను తప్పకుండా 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిందేనని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. గతంలో జనహిత అభియాన్ కేసులో ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు) రిజర్వేషన్ల సందర్భంగా 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేశారని గుర్తు చేశారు. ప్రామాణిక నివేదిక ప్రకారం సమాచారం సుప్రీంకోర్టులో ఉందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని మంత్రి పునరుద్ఘాటించారు. 'మా ముఖ్యమంత్రి రెడ్డి అయితే.. ఎస్సీ ఉప ముఖ్యమంత్రి, మా పీసీసీ అధ్యక్షుడు బీసీ ఉన్నారు. మా వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం' అని మంత్రి పొన్నం వార్నింగ్ ఇచ్చారు.

## బీసీ వర్గాలకు అన్యాయం జరిగితే

# చూస్తూ ఊరుకోం

కూడా చేపట్టాలని స్పష్టం చేశారు. సమీక్షలో నాలుగు గంటలకు పైగా లోతైన చర్చ జరిగింది. రైతులకు మేలు చేసే సూచనలతో పాటు, జలవనరుల శాఖ అధికారులతో నీటి నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు. అన్ని కాలువల ద్వారా నీటిని చిట్టచివరి ఆయకట్టు వరకు విడుదల చేయాలని, నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా గుంటూరు ప్రాంతానికి సాగునీరు అందించాలని ఆదేశించారు. సాగునీటి సంఘాలతో త్వరలో వర్చువల్ సమావేశాలు నిర్వహించి నేరుగా సంప్రదింపులు జరిపేందుకు సీఎం సిద్ధమయ్యారు.

### ఏఐ చాట్ బోట్‌తో రైతులకు సహకారం

పంటల ప్రణాళిక, విలువ జోడింపు, సాంకేతిక సహకారం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్ బోట్‌ను వినియోగించాలని సీఎం సూచించారు. 47.41 లక్షల మంది రైతుల ఈకేవైసీ 'అన్నదాత సుఖీభవ' పథకం కింద పూర్తయిందని అధికారులు తెలిపారు. ఇ-పంట ద్వారా అర్హులను గుర్తించి, ప్రతి రైతుకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ప్రకృతి సేద్యం, ఆర్గానిక్ సర్టిఫికేషన్‌పై దృష్టి

ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూసారం తగ్గుతోందని, రైతులకు సరైన మార్గదర్శనం ద్వారా వీటిని నియంత్రించాలని సీఎం సూచించారు. ప్రకృతి సేద్యం, ఆర్గానిక్ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని, ఆర్గానిక్ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇవ్వడం ద్వారా జపాన్, తైవాన్ వంటి దేశాలకు ఎగుమతులు సాధ్యమవుతాయని తెలిపారు. టాటాతో ఒప్పందం ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్మెంట్, డ్రోన్ల వినియోగం ద్వారా పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు.

### మొబైల్ రైతు బజార్లు, సూక్ష్మ సేద్యం

నగరాల్లో అపార్ట్‌మెంట్ల వద్ద మొబైల్ రైతు బజార్ల ఏర్పాటుతో ఉత్పత్తులను నేరుగా విక్రయించేలా చర్యలు తీసుకోవాలని, 30 రోజుల్లో కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. సూక్ష్మ సేద్యం ద్వారా ఉద్యాన పంటల సాగును విస్తరించాలని, రాయలసీమలో కాలువలతో పాటు మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని సూచించారు.

### మత్స్య, పశుసంపద రంగాలకు ప్రాధాన్యత

మత్స్యకారులకు సముద్ర మత్స్య సంపద వివరాలను యాప్ ద్వారా అందించాలని, సీవీడ్ సాగును ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఆక్వా ఉత్పత్తుల నాణ్యతపై రాజీ లేకుండా, అంతర్జాతీయ ప్రమాణాలు పాటించే రైతులకు సబ్సిడీలు అందించాలని ఆదేశించారు. పశుసంపద రంగంలో 15 శాతం వృద్ధిని లక్ష్యంగా నిర్దేశించారు.

### 'కోకో ముంజ్'పై ముఖ్యమంత్రి ప్రశంసలు

కొబ్బరితో తయారు చేస్తున్న 'కోకో ముంజ్' సంస్థ ఉత్పత్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి సంస్థ ప్రతినిధిని అభినందించారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయం-అనుబంధ రంగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి



**బోయినపల్లి,(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు 20 శాతం సీట్లను కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. యువతలో ఉన్న నాయకత్వ సత్తాను గుర్తించి, వారిని ప్రజాప్రతినిధులుగా మలచాలనే ఆలోచనతో విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. "పార్టీ బలోపేతానికి కృషి చేసిన, జనహిత పరంగా సేవలందించిన అర్హత గల యువజన కాంగ్రెస్ నాయకులకు తగిన గుర్తింపు ఇస్తాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేస్తాం" అని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలు రాజకీయ అంశాలు, పార్టీ బలోపేతం, ఎన్నికల వ్యూహాలు తదితరాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం.

# రోడ్డు మీదనే నిలుస్తున్న వర్షపు నీరు

మంచిర్యాల, : కన్నెపల్లి మండలంలోని వీరాపూర్ గ్రామంలోని మెయిన్ రోడ్డు మీద వర్షపు నీరు ఎటు పోయే మార్గం లేక రోడ్డు మీదనే నిలువ ఉంటున్నాయి. దీంతో వాహనదారులకు, నడిచే వారికి చాలా ఇబ్బంది అవుతుందని స్థానికులు తెలిపారు. వర్షపు నీరు నిలువ ఉండటం వల్ల, దోమల వల్ల వైరల్ జ్వరాల భారీన పడుతున్నారని, కావున ఉన్నత అధికారులు స్పందించి డ్రైనేజ్ ఏర్పాటు చేసి, నీరు నిలువ ఉండకుండా చేయాలి అని స్థానికులు పేర్కొన్నారు.

## వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి, కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామివారిని తిరుమలలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో అభివృద్ధి పథంలో సాగిపోవాలని స్వామివారిని మనసారా వేడుకున్నారు. ప్రజల సంక్షేమం ప్రాంత అభివృద్ధి కొరకు శ్రీవారిని ఆశీస్సులు కోరారు.

## సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం

చెన్నూరు, : చెన్నూరు పట్టణంలోని జగన్నాథ ఆలయం, రాధాకృష్ణ ఆలయాల్లో ఆషాడ బహుల ఏకాదశి సందర్భంగా మంగళవారం మహిళలు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, గోవింద నామాలను పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదకు చికిత్స కోసమై
## రూ. 2 లక్ష రూపాయల చెక్కు అందజేత



సిర్పూర్, : కాగజ్ నగర్ పట్టణంలోని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు నివాసంలో బెజ్జూర్ మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన రామగిరి అరవింద్ కు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. హైదరాబాద్ లోని ప్రఖ్యాత నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసమై సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 2 లక్షల చెక్ ను ఎమ్మెల్యే చొరవ తీసుకుని మంజూరు చేయించారు. దానికి సంబంధించిన ఎల్ఓసి లెటర్ను ఎమ్మెల్యే పేషంట్ కు అందజేయడం జరిగింది.

## రైతులకు రుణమాఫీ అమలు చేయాలని వినతి

ఆసిఫాబాద్, : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రైతులకు షరతులు లేని రూ. 2 లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలంటూ జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ నేతృత్వంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్ లకు వినతిపత్రం ఇచ్చారు. రైతులు బయట వ్యక్తుల నుంచి అప్పులు తీసుకొని బ్యాంకు రుణాలు చెల్లించారని, ప్రభుత్వం హామీ నెరవేర్చాల్సిందిగా డిమాండ్ చేశారు.

## గేదె ఎదురుతిరగడంతో వ్యక్తి మృతి

వేములవాడ,: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన కర్ర అనంతరెడ్డి ఆదివారం రాత్రి గేదెకు ముకుతాడు వేసి కట్టే ప్రయత్నంలో గేదె ఆకస్మికంగా ఎదురుతిరగడంతో కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడి కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతునికి భార్య అలియ, కూతురు ఉన్నారు.

## పని దొరకడం లేదని యువకుడు ఆత్మహత్య

జగిత్యాల, : నూకపల్లి డబుల్ రూం ఇళ్లలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. పని దొరకడం లేదన్న మనస్తాపంతో మహమ్మద్ షబ్బీర్ (20) అనే యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్యాల మండలానికి చెందిన షబ్బీర్ కూలీగా పనిచేస్తుండేవాడు. కొన్ని రోజులుగా ఉపాధి లేక తీవ్రంగా కలతచెందినట్టు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

## బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

సిరిసిల్ల, : బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ సీనియర్ నాయకుడు పెంటల వేణు అన్నారు. ఇల్లంతకుంట మండలం ఓబులాపురంలోని ముత్యాల పోచమ్మ ఆలయం వద్ద మంగళవారం బోర్వెల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. బోర్ వేయడానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రూ 2 లక్షలు నిధులు వెచ్చించాడని పేర్కొన్నారు.

## గుండెపోటుతో ఆర్ఎంపీ మృతి

కొత్తగూడెం, : రామ నరసయ్య నగర్కి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ మౌలా ఖాన్కు అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో ఖమ్మం ప్రశాంతి హాస్పిటల్కి తరలించగా, అక్కడ గుండెపోటుతో మృతి చెందారు. ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ రామనరసయ్య నగర్, అన్నవరం, తుమ్మలపల్లి ప్రజలు శోకవ్యక్తం చేశారు. మాజీసర్పంచ్ వెంకన్నతో పాటు పలువురు ఖమ్మం వెళ్లి పార్థివదేహానికి నివాళులు అర్పించారు

## కోల్ మూమెంట్ ఈడీగా వెంకన్న బాధ్యతలు స్వీకరణ



భద్రాచలం, : సింగరేణి కోల్ మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా బి. వెంకన్న బాధ్యతలు చేపట్టారు. 2010 బ్యాచ్ కు చెందిన వెంకన్న మూడేళ్ల పాటు డిప్యుటేషన్ పై ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు హైదరాబాద్లో బాధ్యతలు స్వీకరించాక సీఎండీ ఎన్. బలరామ్ ను కలిశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ. సింగరేణి సంస్థలో ఏటా సుమారు 700 లక్షల టన్నుల బొగ్గు రవాణా అవుతుందని, ఇందులో అధిక భాగం రైల్వే ద్వారానే సరఫరా చేస్తామని తెలిపారు.

## నాగల్ గిద్దలో నాసిరకంగా
## ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం

నారాయణఖేడ్, : నాగల్ గిద్ద మండల కేంద్రం నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నాసిరకంగా ఉందని అక్కడికి వచ్చిన ప్రజలు వాపోతున్నారు. గత రెండు నెలలుగా బేస్మెంట్ కోసం గుంతలు తవ్వి వారం రోజుల కిందనే ఆరు పిల్లర్లతో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ బిస్మిట్ చేసిన వారం రోజులకే కూలిపోయింది. ఇక్కడ పనిచేస్తున్న మేస్త్రి నిర్లక్ష్యం, అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా జరిగిందని ప్రజలు వాపోతున్నారు.

## ముత్తంగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తనిఖీ

పటాన్చెరు, : పటాన్ చెరు మండలంలోని ముత్తంగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శారద మంగళవారం అకస్మాత్తుగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించి, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో
## జూశీర్ంజూశీర్ంజూశీర్ం

సంగారెడ్డి, : భువనేశ్వర్ లో అత్యాచారం చేసిన ఎన్ఎస్ యుఐ నాయకున్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి లోని కొత్త బస్టాండ్ ముందు ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఎన్ఎస్ యుఐ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకాష్ మాట్లాడుతూ.. అత్యాచారం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## 349 ఉపాధ్యాయుల సర్దుబాటు

ఆందోల్,: సంగారెడ్డి జిల్లాలో 349 ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్దుబాటు ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు 24వ తేదీన వారికి కేటాయించిన పాఠశాలలో విధుల్లో చేరాలని చెప్పారు. పాఠశాల విద్య ఆదేశాల మేరకు విద్యార్థులు ఎక్కువగా ఉండి ఉపాధ్యాయులను లేని చోటుకి సర్దుబాటు చేసినట్లు పేర్కొన్నారు.

## సంగారెడ్డిలో సంతకాల సేకరణ

జహీరాబాద్, : సంగారెడ్డిలో పాస్ పోర్ట్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ మెదక్, సిద్దిపేటలో పోర్టు కేంద్రం ఉన్న సంగారెడ్డిలో ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ యాదవ్, అన్వర్, కృపానిధి, సంతోష్ భాష, సతీష్ గౌడ్ పాల్గొన్నారు.

## వంగూరులో ఎమ్మెల్యే వంశీకృష్ణ పర్యటన

అచ్చంపేట,: అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మంగళవారం వంగూరు మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని చింతపల్లిలో గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం మిట్ట సదగోడ్ గ్రామంలో పర్యటించి కొత్తరేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. కోనాపూర్ లో సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు. అనంతరం పోల్కంపల్లిలో పంచాయతీ కార్యాలయంను ప్రారంభిస్తారు.

## జూరాలకు కొనసాగుతున్న వరద...
## 8 గేట్లు ఎత్తివేత

వనపర్తి, : వనపర్తి జిల్లా జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం ప్రాజెక్టుకు 72, 000 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతుందని అధికారులు వెంకటేశ్వర్లు, జుబేర్ అహ్మద్ తెలిపారు. అల్మట్టి ప్రాజెక్ట్ నుండి 60వేల ఔట్ ఫ్లో కొనసాగుతుందన్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు జూరాలకు వారం రోజులపాటు వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. 8 గేట్ల ద్వారా శ్రీశైలానికి నీటి విడుదల చేస్తున్నారు.

## రేషన్ కార్డులు పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే



నారాయణపేట,: నారాయణపేట జిల్లా ధన్వాడ, మరికల్ మండలాలకు సంబంధించి రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ధన్వాడలోని కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ధన్వాడ తహశీల్దార్ సింధుజ, మరికల్ తహశీల్దార్ రామకోటి తెలిపారు. గ్రామాల వారిగా రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రెండు మండలాలకు సంబంధించిన లబ్ధిదారులు విధిగా హాజరు కావాలని కోరారు.

## డీలర్ల నిర్లక్ష్యంతో లబ్ధిదారులకు సమాచారం లోపం

మహబూబ్నగర్, : నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో ధన్వాడ-మరికల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సరిగ్గా నిర్వహించబడలేదు. అధికారులు, డీలర్లు నిర్లక్ష్యం వహించడంతో సమాచారం సరిగ్గా లభించక, 80 మందికి మాత్రమే పంపిణీ జరిగింది. ఈ విషయంపై ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి సిబ్బంది మాధవ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కలెక్టర్కి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## వీరభద్ర ఆలయంలో
## లోక కళ్యాణార్థం హెూమం పూజలు

మక్తల్, : దామరగిద్ద మండల ఆరాధ్య దైవం క్యాతన్ పల్లి శ్రీ వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో లోక కళ్యాణార్థం అభిషేకం, హెూమ పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం దాతల సహకారం 50 లక్షల రూపాయలతో నిర్మించిన ఎనిమిది వసతి గృహాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ, పూజారులు, వసతి గృహాల దాతలతో కలిసి రాజ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఆరోగ్యబీమా పథకంపై వినతి

పినపాక, : తెలంగాణ న్యాయవాదుల ఆరోగ్య బీమా పథకంలో భాగంగా జిల్లాల వారీగా ఆస్పత్రులను పెంచాలని, రీయింబర్స్మెంట్ వేగవంతం చేయాలని న్యాయవాదులు కోరారు. ఈమేరకు ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యులు తాళ్లూరి దిలీప్, పసుపులేటి శ్రీనివాస్ ఢిల్లీలోని మెడ్ సేవా టీపీఏ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ బాధ్యులకు వినతిపత్రం సమర్పించారు. మెడ్ సేవా అధికారులు దీపక్ కుమార్, గీత సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

## ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే దంపతులు



నకిరేకల్, : నకిరేకల్ పట్టణంలోని వెంకటేశ్వర స్వామి 42వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## మాల మహానాడు సాగర్
## వర్కింగ్ ప్రెసిడెంట్ గా వెంకటేశ్వర్లు

నాగార్జునసాగర్,: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య ఆదేశాల మేరకు, హాలియా గెస్ట్ హౌస్లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మదారిగూడెం గ్రామానికి చెందిన రువ్వ వెంకటేశ్వర్లును నాగార్జునసాగర్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్గా నియమించి నియమపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేసిన సహాయ వ్యవసాయ సంచాలకులు

కామారెడ్డి, : కామారెడ్డి సహాయ వ్యవసాయ సంచాలకులు అపర్ణ దోమకొండలో మంగళవారం ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. మండలంలో రైతులకు సరిపడా యూరియా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లో అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు సరైన మోతాదులో యూరియా వాడాలని సూచించారు. మోతాదుకు మించి యూరియా వాడటం వలన చీడ పీడలు ఆకర్షించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మణిదీపిక, ముత్యంపేట సొసైటీ చైర్మన్ తిరుపతి గౌడ్ ఉన్నారు.

## స్పెషల్ డ్రైవ్ ద్వారా 150 పోగొట్టుకున్న
## మొబైల్ ఫోన్ల రికవరీ

ఎల్లారెడ్డి, : సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన పడొద్దని సిఇఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరికి గురైన 150 మొబైల్ ఫోన్లను ( సుమారు 25 లక్షల విలువగల) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించడం జరుగుతుందని వెల్లడించారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం అన్నారు.

## భారీ వర్షంతో అడవి లింగాల
## చెక్ డ్యామ్ కు జలకళ

జుక్కల్, : ఎల్లారెడ్డి మండలంలోని అడవి లింగాల్ -పోసాని పల్లికి సంబదించిన వాగులపై కట్టిన చెక్ డ్యాంలు రాత్రి కురిసిన వర్షానికి జలకళ ను సంతరించుకున్నాయి. మంగలవరం ఉదయం ఈ చెక్ డ్యాంలో కొత్త నీరు పరుగులు తీస్తుంది. దీంతో ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుంది. ఎల్లారెడ్డి మండలంలోని మాచపూర్ లో 4. 3మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది.

## లింగంపేట్ మండలంలో
## 42. 5 మిల్లిమీటర్ల అత్యధిక వర్షపాతం

బాన్సువాడ, : కామారెడ్డి జిల్లాలో రాత్రి పలు మండలాల్లో భారీ వర్షా పాతం నమోదైంది. కలెక్టరెట్ నుండి మంగళవారం విడుదల చేసిన వర్షపాతం నమోదు వివరాల్లోకి జిల్లాలోనే లింగంపేట్ మండలంలో 45. 5మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. పిట్లంలో 31. 0మిల్లిమీటర్లు, నిజాంసాగర్ లో 27. 3మిల్లి మీటర్లు, పెద్దకొడప్గల్ 17మిల్లిమీటర్లు, బీబీపేట్ 13మిల్లిమీటర్లు నమోదైంది. బిచ్కుంద, జుక్కల్ మండలాల్లో వర్షపాతం %శీ% నమోదు కావడం గమనార్హం.

## అడవులను సృష్టించి
## పర్యావరణాన్ని కాపాడుదాం

సత్తుపల్లి, : అడవులను సృష్టించి పర్యావరణాన్ని కాపాడదామని సత్తుపల్లి సబ్ జైల్ సూపరింటెండెంట్ ఉబ్బల కుటుంబరాజు అన్నారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో వనమహెూత్సవం అవసరాల కోసం 2వేల సీడ్ బాల్స్ తయారు చేయించిన వేప, చింత, సీతాఫలం, మద్ది విత్తనాలను మంగళవారం సత్తుపల్లి అర్బన్ పార్క్ లో చల్లామని తెలిపారు. అడవులను సంరక్షించి భవిష్యత్ తరాలకు పచ్చదనాన్ని పంచుదామని, సమాజాభివృద్ధిలో యువత భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు.

## కూలిన ఇంట్లో బతుకుతున్నాం..
## ఇల్లు ఇప్పించండి



మహబూబాబాద్, : ఖానాపురం గ్రామానికి చెందిన షేక్ యాకూబీ, బడేసాబ్ అనే వృద్ధ దంపతులు 80 ఏళ్లుగా రేకుల షెడ్లలో నివసిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటి గోడ కూలి ఇల్లు పూర్తిగా శిథిలమైంది. నలుసార్లు ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసినా ఇప్పటివరకు మంజూరు కాలేదు. భయంతో శిథిలమైన ఇంట్లో జీవిస్తున్న వీరికి వెంటనే ఇల్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బీసీ బిల్లుల ఆమోదం కోసం సీఎం తోపాటుగా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

**- బీసీ సాధికారత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు : పాలాస నరేందర్**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** ఢిల్లీకి వెళ్లే సీఎం రేవంత్ రెడ్డితో పాటు అఖిలపక్ష నాయకులను తీసుకెళ్లాలని బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ డిమాండ్ చేశారు. ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదించిన బీసీ రిజర్వేషన్ బిల్లులు కేంద్ర ఆమోదానికి పెండింగ్‌లో ఉన్నందున, కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.కొందరు బీజేపీ నేతలు బిల్లులను వ్యతిరేకించడం సరికాదని హెచ్చరిస్తూ, అడ్డుపడితే బీసీ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతుందని తెలిపారు. స్థానిక ఎన్నికలు ఆర్డినెన్స్ ద్వారా జరిపిస్తారా, లేక కేంద్ర ఆమోదంతోనా అనే విషయంలో స్పష్టత ఇవ్వాలని, అలాగే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల బిల్లుపైనా నిర్ణయం తెలపాలని కోరారు. తమిళనాడు తరహాలో శాస్త్రీయంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నరేందర్ విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా బిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు సంతోష్ రావు జన్మదిన వేడుకలు

**- ముఖ్య అతిథులుగా పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**




**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్)** ఘనంగా కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు అభిమానులు ఏడుపాయల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జన్మదిన వేడుకలు నిర్వహించారు ఈ జన్మదిన వేడుకల్లో నర్సాపూర్ శాసనసభ్యులు వాకిటి సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథుల పాల్గొని యువజన అధ్యక్షునికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి వారికి కేక్ కట్ చేయించి పూలమాలతో శాలువతో ఘనంగా సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కొల్చారం మండలం యువజన అధ్యక్షుడు సంతోష్ రావు జన్మదిన వేడుకలు మండలంలో ఉన్న వివిధ గ్రామాల యువకులకు వాలీబాల్ టోర్నమెంట్ కిట్టులను యువకులకు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని మరియు జన్మదిన వేడుకలు శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారి సన్నిధిలో జరుపుకోవడం వలన శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని భవిష్యత్తులో మరెన్నో పదవులను ఆశించి యువతకు ఆదర్శంగా నిలవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి దీవించారు ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్ , మాజీ జిల్లా కో ఆప్షన్ నెంబర్ మన్సూర్ , కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంపల్లి గౌరీ శంకర్ , కొల్చారం మండలం తాజా మాజీ జెడ్పిటిసి ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్, రంగంపేట పిఏసిఎస్ మాజీ చైర్మన్ అరిగి రమేష్, మాజీ జెడ్పిటిసి పాశం శ్రీనివాస్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు సొసైటీ డైరెక్టర్లు , వార్డ్ మెంబర్లు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** కొల్చారం మండల పరిధిలోని పైతర గ్రామానికి చెందిన వివిధ బాధితులు కొండ ముగ్గులమ్మ కు 60 వేల రూపాయలను మరియు అదే గ్రామానికి చెందిన ఆకుల సుమిత్ర కు 14,500 చెక్కులను నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి సహకారంతో మంగళవారం నాడు మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి చేతుల మీదుగా బాధితులకు అందజేయడం జరిగింది ఈ సందర్భంగా రవితేజ రెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట ఒక గొప్ప వరం అని తెలిపారు అడిగిన వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ రిలీజ్ చేసిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పైతర మాజీ తాజా సర్పంచ్ ఎల్లేశం, మాజీ సర్పంచ్ మురళి గౌడ్ , బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మల్లేశం, నాయకులు ఆంజనేయులు గౌడ్ , తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెదక్ ఆర్టీసీ బస్ స్టేషన్ లో సంబురాలు

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) మహాలక్ష్మి పథకంలో భాగంగా జిల్లా కి సంబందించి...ఇప్పటి వరకు ఆర్టీసీ లో మహిళలు ఉచితంగా ప్రయాణం ఈ పథకం సమర్థవంతంగా అమలు పై కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 2023 డిసెంబర్ 9వ తేదీ నుండి విజయవంతంగా అమలవుతోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో సంబరాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

## విద్యార్థులు చదవడం, రాయడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- జిల్లా కలెక్టర్ : సందీప్ కుమార్ ఝా**

**- చీర్లవంచలోని విద్యాలయాల్లో ఆకస్మిక తనిఖీ**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** పాఠశాలలోని ప్రతీ విద్యార్థి చదవడం రాయడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ అర్బన్ మండలం,చీర్లవంచ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ తరగతి గదిని సందర్శించి, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు,మౌళిక వసతులు, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు,విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్న తీరునుపరిశీలించారు. ప్రతీ తరగతి గదిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? ఎవరైనా దీర్ఘకాలికంగా పాఠశాలకు గైర్హాజరు అవుతున్నారా అనే వివరాలను ఆరా తీశారు.అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి సక్రమంగా చదవడం, రాయడం వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.మధ్యాహ్న భోజనం తప్పనిసరిగా గ్యాస్ సిలిండర్ పైన తయారు చేయాలని ఆదేశించారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్యాస్ సిలిండర్ ఇంకా రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో, ప్రహరీ వెంట మొక్కలు నాటించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. విద్యార్థులకు సరిపడా కంటే ఎక్కువగా అందుబాటులో ఉన్న డెస్క్ లను అవసరం ఉన్న ఇతర పాఠశాలలకు పంపించాలని సూచించారు.

## 29న నాగ పంచమి బ్రహ్మోత్సవాలు



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండలంలోని గాజులపల్లి శ్రీ సంతాన నాగేంద్ర స్వామి ఆలయంలో ఈనెల 29న నాగ పంచమి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు గౌతం శశికళ-సత్యనారాయణలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలోని స్వామి వారికి పుట్టలో పాలు పోయడం, నాగ ప్రతిమలు పుట్టలో జారవిడవడం, ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు, చలిమిడి, పండ్లు, వడపప్పు సమర్పణ రాహు, కేతు, కుజ దోషాలకు శాంతి పూజ, ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఇతర వివరాల కోసం సెల్ నెం. 9441801741, 799727537 లను సంప్రదించాలని కోరారు.

## మంథని రెవిన్యూ డీవిజినల్ అధికారికీ

**యాదవ సంఘ అధ్యక్షులు పర్శవేన మోహన్ వినతిపత్రం అందజేత.**



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండలం చిల్లపల్లి గ్రామానికి చెందిన పుట్ట పోచయ్య తండ్రి. మంహంకాళి. పుట్ట సంతోష్ తండ్రి.పోచం గొర్రెల కాపరి సిరిపురం దగ్గర గోదావరి ఒడ్డుకి గొర్లను మేపాడానికి వెళ్లగా సాయంత్రం 5 గంటల సమయం లో ఒకే సారి పెద్ద శబ్దంతో గొర్ల మంద పైన పిడుగు పడటంతో 36 గోర్లు అక్కడికి అక్కడే పిడుగు పాటుతోచనిపోయాయి అక్కడే ఉన్న గొర్ల కాపరి పుట్ట పోచయ్య కళ్ళు ఒకే సారి కళ్ళు మూతలు పడి పడిపోయారు అక్కడే గొర్ల మేపుతున్న గొర్ల కాపరి గోపు గంగయ్య వెంటనే వారి కుటుంబ సభ్యులకు గ్రామ స్తులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వెళ్ళి పుట్ట పోచం కి స్వల్ప గాయాలు అయ్యియి. కావున ప్రభుత్వం వెంటనే పిడుగు పాటుకు గురైన 36 గొర్రెలకు 3 లక్షలు పైన నష్టం వాటిల్లింది కాబట్టి అట్టి గొర్రెల కాపరికి కుటుంబ నీకి ప్రభుత్వం ఆదుకొని నష్టం పరిహారం చెల్లించి నష్ట పోయిన కుటుంబన్ని ఆదుకోవాలి యాదవ సంఘనాయకులు కోరినారుఇట్టి కార్యక్రమంలోమంథని మండలం యాదవ్ సంఘ అధ్యక్షులు.పర్శవేన మోహన్ యాదవ్. మాజీ సర్పంచ్లు కనవేన శ్రీనివాస్ యాదవ్, జాగిరి సాధనందం యాదవ్,. కనవే కొమురయ్య యాదవ్., సింగనవేన మల్లేష్ యాదవ్., బోగొండ రవి యాదవ్,. మాదారవేన ఓదెల యాదవ్, తదితరులు యాదవ్ నాయకులు పాల్గొన్నారు.

## మహిళల స్వయం ఉపాధిలో బ్యూటీ, మేకప్ రంగాలు కీలకం

**- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే : ఆది శ్రీనివాస్**

**- మహిళల నైపుణ్యాభివృద్ధి ప్రదర్శనకు వేదికగా మేకప్..! హెయిర్ పే సెమినార్...!!**




**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మహిళా బ్యూటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో "మేకప్, హెయిర్ పే"పై ఒక రోజు ప్రత్యేక సెమినార్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడంలో బ్యూటీ,మేకప్ రంగాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఇలాంటి శిక్షణా కార్యక్రమాల ద్వారా మహిళలు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకొని స్వయం ఉపాధి దిశగా సాగాలి" అని ఆకాంక్షించారు. ప్రభుత్వానికి మహిళల అభివృద్ధే ప్రధాన లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ బ్యూటీషియన్‌లు, ట్రైనర్లు భాగస్వాములై ప్రాక్టికల్ డెమోలు, టెక్నికల్ సెషన్లు నిర్వహించారు. మేకప్‌లో తాజా ట్రెండ్స్, హెయిర్ స్టైలింగ్‌లో క్రొత్త విధానాలపై విశ్లేషణలు చేయబడ్డాయి. శిక్షణా కార్యక్రమంలో వేములవాడ పరిసర ప్రాంతాల నుండి వందల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా బ్యూటీ అసోసియేషన్ ప్రతినిధులు, సంఘ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ రహదారులపై దృష్టి సారించాలని రోడ్డుపై బైఠాయింపు

**- సిపిఎం డిమాండ్**



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** బోయినిపల్లి మండలంలోని దేశాయిపల్లి-రామన్నపేట, బోయినిపల్లి-విలాసాగర్, విలాసాగర్-గర్షకుర్తి, నాగులమల్యాల రహదారులు పూర్తిగా అద్వానంగా మారాయని రోడ్డుపై బైఠాయించి సిపిఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత అభివృద్ధికి పదే పదే హామీలు ఇచ్చే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రహదారుల పరిస్థితిపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తక్షణమే నూతన రహదారుల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుడుకల గిరిబాబు,తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈనెల 27న తిప్పాపూర్ గోశాలలో కోడెల పంపిణీ

**- వెబ్‌సైట్ ద్వారా ముందుగా దరఖాస్తు తప్పనిసరి**

**- ఆలయ ఇంచార్జి ఈఓ : రాధాబాయి**

**- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి : రవీందర్ రెడ్డి**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలో ఈ నెల 27వ తేదీన (ఆదివారం) ఉదయం 8:30 గంటలకు 200 కోడెలను పంపిణీ చేయనున్నట్లు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఇంచార్జి ఈఓ రాధాబాయి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రవీందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్లతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు ఆనుకొని ఉన్న ఇతర జిల్లాల సన్నకారు, చిన్నకారు రైతులు అర్హులు.రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్,ఆధార్ కార్డు వంటి ధృవపత్రాలతో ముందుగా సంబంధిత వెబ్‌సైట్ లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పంపిణీ సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన అసలు పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు.జియో ట్యాగింగ్ ఉన్న కోడెలను మాత్రమే అర్హులైన వారికి అందజేస్తామని అధికారులు తెలిపారు. జియో ట్యాగింగ్ కారణంగా భవిష్యత్‌లో కోడెల వినియోగం,సంరక్షణను పర్యవేక్షించేందుకు వీలవుతుందని వివరించారు.కోడెలను తీసుకెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను నిజాయితీగా నిర్వహించాలని సూచించారు.

## నేడు విద్యా బంద్‌ను విజయవంతం చేయండి

**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి : ప్రశాంత్**




**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై నేడు బుధవారం (జూలై 23న) పాఠశాలలు, జూనియర్ కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్లలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదని, ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని కూడా నియమించకపోవడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ విద్యను క్షీణింపజేస్తూ ప్రైవేట్ యూనివర్సిటీలకు ప్రోత్సాహం అందించడమేద్వారా పేద,మధ్య తరగతి విద్యార్థులు నష్టపోతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలతోనే అధికారాన్ని కోల్పోయిందని గుర్తు చేస్తూ, కొత్త ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని అన్నారు.

**- ఎస్ఎఫ్ఐ డిమాండ్లు**

**- పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి**
**- విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయించాలి**
**- ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి**
**- ఉచిత బస్సు పాసులు అందుబాటులో ఉంచాలి**

- జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని,వీటిపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరుతూ, వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23న విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు భారీగా స్పందించి విజయవంతం చేయాలన్నారు.ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్, కమిటీ సభ్యులు కదారి శివ,జశ్వంత్,సుశాంత్,సాయి శివ,శ్రేయాన్,సాజిద్,ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ పార్టీని తీవ్రంగా ఖండించిన రెడ్డివారి గురవారెడ్డి



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ కార్యాలయం లో మీడియా సమావేశంలో వైసిపి పార్టీ వారు బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండించిన రాష్ట్ర అధికార ప్రతినిధి మైదుకూరు పార్టీ నియోజకవర్గ పరిశీలకులు రెడ్డివారి గురవారెడ్డి మీడియా సమావేశంలో రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 13 నెలల కాలం పూర్తయిన సందర్భంగా మరి ఏ విధంగా అయితే అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారు ప్రజలంతా చూస్తున్నారు. అన్నారు మరి గతంలో 19 24 మధ్య ముఖ్యమంత్రి గా జగన్ మోహన్ రెడ్డి దుర్మార్గమైన అరాచక పాలన నిర్వహించిన విధానాన్ని వివరిస్తూ మరి ఆనాడు వారు ప్రతిపక్షంలో ఉండి 14 19 మధ్య పాదయాత్ర పేరుతో ప్రజల్లోకి వెళ్లి నవరత్నాలు అందిస్తానని చెప్పి అడిగిన వాళ్ళకి అడగనోళ్లకు ముద్దులు పెట్టి పిడుగులు గుద్దడానికి నిదర్శనమే వారి పరిపాలనలో వృద్ధులు వితంతువులకు పెన్షన్ 3000 రూపాయలు ఇస్తానని చెప్పి ఐదు సంవత్సరాల కాలం తీసుకోవడమే వారు ప్రజలను మోసం చేశారని నిదర్శనమే అది అన్నారు ఆనాడు ప్రతిపక్షంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఉన్నటువంటి పార్టీ భవిష్యత్ గ్యారెంటీ బాబు షూరిటీ కార్యక్రమం ద్వారా సూపర్ సెక్స్ పథకాలని హామీ ఇవ్వడం జరిగింది దాంట్లో భాగంగా అధికారంలోకి వచ్చిన మరుక్షణం పెన్షన్ల కొరకు నాలుగు వేల రూపాయల్ని ఒకేసారి అందజేసి ఈ సంవత్సర కాలంలో 33 వేల కోట్ల రూపాయలు 65 లక్షల మందికి అందజేసినటువంటి సంక్షేమ ప్రభుత్వం చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమీ ప్రభుత్వం అన్నారు ఈరోజు మీరు వైసిపి వారు తీసుకొచ్చినటువంటి బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండిస్తూ మరి మీరు ఐదు సంవత్సరాల కాలంలో పెన్షన్ 3000 ఇచ్చింది మోసం చేయడమా మరి చంద్రబాబు నాయుడు పరిపాలనలో అధికారంలోకి వచ్చిన మరుక్షణం నాలుగు వేల రూపాయల అందించడం మోసమా గుర్తుపెట్టుకోండి అని వైసిపి నాయకులను హెచ్చరిస్తున్నాం అన్నారు అదేవిధంగా మీరు వైసీపీ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో పాదయాత్రలో అమ్మ ఒడి పేరుతో ఎంతమంది బిడ్డలు ఉన్న 15వేల రూపాయలు వేస్తామని చెప్పి హామీ ఇచ్చి కేవలం ఒక బిడ్డకి అమ్మఒడివేసి చదువుకునే బిడ్డల్ని మోసం చేసింది వాస్తవం కాదా అని సూటిగా మిమ్మల్ని ప్రశ్నిస్తున్నామన్నారు.

## కమీషనర్ నిత్యానందను కలిసిన మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్ ముదిరాజ్

**స్థానిక సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ ను కోరిన వైస్ ఎంపీపీ**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) నూతనంగా ఏర్పడిన ఎల్లంపేట పురపాలక సంఘం కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన సిర్ర నిత్యానందను తన కార్యాలయంలో మేడ్చల్ మండల వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్ ముదిరాజ్ మంగళవారం శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ నిత్యానందను కోరారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్ విన్నపం మేరకు స్పందించిన కమిషనర్ నిత్యానంద స్పందిస్తూ అతి త్వరలో ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరుండి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీను నాయక్, నర్సింగ్ రావు, బాలగోపాల్ పాల్గొన్నారు

## తెప్పోత్సవం, నయనోత్సవం



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తెప్పోత్సవ వైభవంతో భక్తకోటి పులకించింది సోమవారం రాత్రి ఉభయ దేవేరులతో కలసి కుమారస్వామి నారద పుష్కరిణి అలలపై విహరించారు. స్వామివారికి స్వర్ణాభరణాలతో శోభయామానంగా అలంకరించారు. ఆరు దఫాలుగా తెప్పలపై ఉత్సవమూర్తులను ప్రదక్షిణగా తిప్పారు. ఆలయ దీక్షా గురుకుల్ సురేష్, ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్ కర్పూర హారతులు ఇచ్చారు. ఈ విశేషోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో బాపిరెడ్డి, మాజీ మంత్రి గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి జనార్ధన్ రెడ్డికి మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే బొజ్జల



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి స్వామి వారి దర్శనార్థం విచ్చేసిన రాష్ట్ర మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే బొజ్జల శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనార్థం విచ్చేసిన రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మాత్యులు బీసీ జనార్ధన్ రెడ్డి దంపతులకు స్వాగతం పలికి దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందించిన శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి దర్శన అనంతరం శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి స్వగృహానికి వెళ్లిన మంత్రి అల్పాహారం స్వీకరించి మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న మంత్రి, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రోడ్లు మరియు బ్రిడ్జిల నిర్మాణాల కొరకు పలు ప్రతిపాదనలు చేసిన శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు మంత్రివర్యులు వెంటనే స్పందించి సదరు పనులను మంజూరు చేయుటకు ఆదేశించడం అయినది.

# గూడూరు రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ లకు నూతన పాలకవర్గాల బాధ్యతల స్వీకరణ

**- రోటరీ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డీ**

**- ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మాధురి, లక్ష్మీ**






**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)** గూడూరు రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ లకు 2025-26 సేవా సంవత్సరమునకు నూతన పాలకవర్గాలు సోమవారం బాధ్యతలు చేపట్టాయి. స్థానిక సీ ఆర్ రెడ్డి కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రోటరీ ప్రముఖులు రొటేరియన్స్ బొమ్మిరెడ్డి సురేంద్ర రెడ్డి, డాక్టర్ సి. జనార్దన్ రెడ్డి డాక్టర్ రోహిణీ దంపతులు, భరత్ రెడ్డి, కొణిదల మునిగిరీష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో గూడూరు రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ విభాగాలకు వున్న ప్రత్యేక గుర్తింపును కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్టాత్మక సేవా కార్యక్రమాలతో రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ లు ప్రజలకు సేవాలాందించాలని వారు ఆకాంక్షించారు. రోటరీ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు రెడ్డి,మల్లు విజయ్ కుమార్ రెడ్డీలు,ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మాధురి, లక్ష్మీ లు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేప ట్టారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రముఖులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, శ్రీకంటి రామ్మోహన్ రావు, శ్రీధర్ రెడ్డి, జీజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఎస్ కే ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రింటర్ ను బహుకరించారు.

## కిశోర బాలికల వికాసంపై అవగాహన సదస్సు

**- ఐ సి డి ఎస్ సీ డిపివో మహబూబ్**



**నెల్లూరు బ్యూరో( ప్రశ్న న్యూస్ )** గూడూరు మండలంలోని పారిచర్ల రాజుపాళెం గ్రామం లోని అంగన్వాడీ కేంద్రం నందు మంగళవారం కిశోర బాలికల వికాసంపై ఐసిడిఎస్ సిడి పివో మెహబూబ్ ఆధ్వర్యంలో సి డి పి వో శారదమ్మ అధ్యక్షతన విద్యార్థినులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీ డిపివో మహబూబ్ మాట్లాడుతూ . కిషోర బాలికల వ్యక్తిత్వ వికాసం వద్ధి చెందేలా అందరూ సమిష్టిగా కషి చేయాలని పిలుపునిచ్చారు.

ఇందులో వ్యక్తిగత ఆరోగ్యం, రక్త హీనత, మహిళా అక్రమ రవాణా, లింగ వివక్ష, బాల్య వివాహాలు నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వారువివరించారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అంగన్వాడీ కార్యకర్తలు లు తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు స్వరూప రాణి, అంగన్వాడీ కార్యకర్త కవిత, హెల్త్ డిపార్ట్మెంట్ అరుణ, ఏ ఎన్ ఏం కుమారి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడినా వారిపై కఠిన చర్యలు



సిరికొండ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం కేంద్రంలో ముగ్గురు వ్యక్తులు పబ్లిక్ ప్లేసులో మద్యం సేవించి న్యూసెన్స్ చేసినారు. దీనిపై సంబంధిత పోలీస్ స్టేషన్లో కేసు నమోదుకు చేసి, నిందితులను మంగళవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా వారికీ రెండు రోజుల జ్యూడిషల్ కస్టడీ విధించారు, అదేవిదంగా డ్రంకెన్ డ్రైవ్ కేసు లో పట్టుబడిన వ్యక్తి కి కూడా రెండు రోజుల జ్యూడిషల్ కస్టడీ విధించారు. ఎవరైనా పబ్లిక్ ప్లేసులో లో మద్యం సేవించినా, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ వారి తరపున హెచ్చరిస్తున్నాము.

## ధర్పల్లి సీఐ కార్యాలయం పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్

**- పోలీస్ ఇమేజ్ పెంచే విధంగా ప్రతి సిబ్బంది విధులు నిర్వహించాలి**



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి కేంద్రంలో మంగళవారం నాడు మధ్యాహ్నం సమయంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య,ఐ.పీ.ఎస్.ధర్పల్లి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించడం జరిగింది. ముందుగా పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ నిజామాబాద్ ఏసిపి, ధర్పల్లి ఇన్స్పెక్టర్, ధర్పల్లి ఎస్సై, సిరికొండ ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఫైల్స్ ను క్షుణ్ణంగా తనిఖీ లు నిర్వహించారు. పోలీస్ విభాగము నిర్విరామముగా నిర్వహిస్తున్న పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల యొక్క భద్రత,శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ధర్పల్లి సర్కిల్ పరిధిలోని రికార్డ్ లను పరిశీలిస్తూ , అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని , ప్రతి కేసులో నాణ్యమైన , ఇన్వెస్టిగేషన్ చేయాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ కు సూచనలు చేశారు. ఈ సర్కిల్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు, కళాశాలలో, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాలలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై గ్రామాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేసి , అట్టి గ్రామాలలో ఉన్నటువంటి సమాచారము తమపై స్థాయి అధికారులకు ఎల్లప్పుడూ చేరవేయాలి అన్నారు. ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ,సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి, చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు,సిబ్బంది 24 గంటలు, 7 రోజులు తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని , దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏ.సి.పి రాజా వెంకటరెడ్డి , ధర్పల్లి సిఐ బిక్షపతి , ధర్పల్లి ఎస్.ఐ ఎం. కళ్యాణి , సిరికొండ ఎస్.ఐ జె. రామకృష్ణ , తదితరులు పాల్గొనడం జరిగింది.

# బోర్డు అభివృద్ధి ఓకే, ప్రజా అభిప్రాయం ముఖ్యం: ఎమ్మెల్యే



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నెలకొన్న మౌళిక సమస్యలు భవిష్యత్తులో పుణరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ బోర్డు కార్యాలయంలో విలేకరులతో పంచుకున్నారు. కాలం చెల్లిన భూగర్భ వ్యవస్థను పటిష్టం చేసే సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుండి సమకూర్చిన 303,62 కోట్ల రూపాయలను కంటోన్మెంట్ ప్రాంతా అభివృద్ధి కోసం సమన్వయంతో కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. ఇదే అంశంపై కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ తో ప్రత్యేకంగా భేటీ అయ్యి చర్చించారు. సుదీర్ఘంగా గంటన్నర పాటు బోర్డు పరిధిలో ఉన్న సమస్యలు పట్ల సిఇవోతో ప్రత్యేకంగా చర్చించారు. ఎగువన ఉన్న కూకట్పల్లి నియోజకవర్గంలో ఉన్న ఓల్డ్ బోయిన్ పల్లి ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు భారీగా కంటోన్మెంట్ లోకి రావడంతో దిగువన ఉన్న ప్రాంతం వర్షం ముంపుకు గురౌతున్న సమయంలో, అక్కడ నెలకొన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. అలాగే “303”కోట్ల రూపాయల వ్యయం ఆచి తూచి ఖర్చు చేయాలని, అందుకనే ప్రజా అభిప్రాయం తప్పని సరి అంటూ అధికారులను కోరడం జరిగింది. బోర్డు పరిధిలో హస్మత్ పెట్,పికెట్ నాలాల అభివృద్ధి కోసం నిధులను వెచ్చించి కంటోన్మెంట్లో వరద ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. నాలాల విస్తరణ అభివృద్ధి తో పాటు భూగర్భ డ్రైనేజీ పనులను కూడా చేపట్టాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ చేసి ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా అభివృద్ధి పనులు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు ప్రజా ప్రతినిధుల సమన్వయంతో కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్,
తేలుకుంట సతీష్,సంతోష్ యాదవ్,రాకేష్, టిఎమ్మార్పీఎస్ మీడియా కోఆర్డినేటర్ ఇటుక గోపి, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు శరత్ తదితరులు పాల్గొన్నారు.

# సినీ ఇండస్ట్రీ అన్నం పెట్టింది.. అండగా ఉంటా

## 'హరి హర వీరమల్లు' ప్రెస్ మీట్ లో పవర్ స్టార్




ఆకలి తీర్చిన సినీ ఇండస్ట్రీకి.. నన్ను నమ్మిన నిర్మాతలకు ఎప్పుడూ అండగా ఉంటానన్నారు పవర్ స్టార్ పవన్ కల్యాణ్. 'హరి హర వీరమల్లు' టీం నిర్వహించిన ప్రెస్ మీట్ లో పాల్గొన్న పవన్ కల్యాణ్ .. కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను పంచుకున్నారు. "మీడియా మిత్రులతో రాజకీయాల పరంగా చర్చింను కానీ, ఇలా ఒక సినిమా కోసం పెద్దగా మాట్లాడలేదు. సినిమాకి సంబంధించి మాట్లాడటానికి నేను మొహమాటపడతాను. సినిమాని ఎలా ప్రమోట్ చేసుకోవాలో నాకు తెలియదు. పని చేయడం తెలుసు తప్ప.. ఇంత చేశాను, అంత చేశాను అని చెప్పుకోవడం నాకు ఇబ్బందిగా ఉంటుంది. నేను అనుకోకుండా నటుడిని, సాంకేతిక నిపుణుడిని అయ్యాను. సినిమా గురించి మీడియాతో మాట్లాడకపోవడానికి నాకు పొగరో, అహంకారమో కారణం కాదు. సినిమా గురించి చెప్పుకోవడానికి నాకు ఇబ్బందిగా ఉంటుంది. కానీ, ఈ ప్రెస్ మీట్ ఎందుకు పెట్టానంటే.. ఎ.ఎం. రత్నం గారి కోసం పెట్టాను. ప్రాంతీయ సినిమాని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి ఆయన. తమిళ సినిమాలను తెలుగులో విడుదల చేసి, స్ట్రయిట్ సినిమాల స్థాయిలో ఆడించి సత్తా చూపించిన వ్యక్తి. ఈ సినిమా చాలా ఒడిదుడుకులు ఎదుర్కొంది. రెండు కరోనా పరిస్థితులు ఎదుర్కొంది. ఈ సినిమాకి ప్రత్యేకించి ఎ.ఎం. రత్నం గారి తపన చూశాను. నేను ఖుషి సినిమా చేస్తున్న సమయంలో జ్యోతికృష్ణ లండన్ లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ చేశారు. ఆయనతో మాట్లాడుతుంటే సెన్సిబుల్ డైరెక్టర్ అనిపించింది. ఈ సినిమా అసలు పూర్తవుతుందా లేదా అని మాటలు వినిపిస్తున్న సమయంలో.. మాకు ప్రాణవాయువు ఇచ్చిన వ్యక్తి కీరవాణి గారు. అలాగే నిధి అగర్వాల్ సినిమా ప్రమోషన్ బాధ్యతను తీసుకున్నారు. ఈ సినిమా అనాథ కాదు.. నేనున్నాను అని చెప్పడానికి వచ్చాను ఈరోజు అన్నారు పవన్ కల్యాణ్.

# బడా హీరోలతో నటించడం వేస్ట్: నిత్యామీనన్



సౌత్ సినీ ఇండస్ట్రీలో ట్యాలెంటెడ్ హీరోయిన్లలో నిత్యామీనన్ ఒకరు. చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ... స్టార్ హీరోయిన్ గా ఎదిగింది. 'అలా మొదలైంది' సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. మలయాళం, తెలుగు, తమిళ్, కన్నడ సినిమాల్లో నటించిన నిత్య... బాలీవుడ్ లోనూ మెరిసింది. 'భీమ్లా నాయక్' తర్వాత తెలుగు సినిమాల్లో నటించలేదు. అయితే స్టార్ హీరోస్ పై నిత్యా చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. పెద్ద హీరోల సినిమాల్లో నటించడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని తేల్చి చెప్పేసిందీ అమ్మడు. చిన్న హీరోల సినిమాల్లో నటిస్తేనే హీరోయిన్లకు మంచి పేరు వస్తుందని, కిక్ ఉంటుందని చెప్పింది.

తన పాత్రకు ప్రాధాన్యత ఉంటేనే ఆ సినిమాలో నటిస్తానని.. అందుకే సినిమాలకు లాంగ్ బ్రేక్ తీసుకున్నానంటోంది నిత్య. ఎంతైనా ఇండస్ట్రీ నిత్యా రూటే సపరేట్ అంటున్నారు ఫ్యాన్స్

# "థాంక్యూ డియర్" సాంగ్ లాంచ్ చేసిన మంచు మనోజ్



తోట శ్రీకాంత్ కుమార్ డైరెక్షన్ లో పప్పు బాలాజీ రెడ్డి నిర్మాతగా మహాలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్ పై త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న మూవీ థాంక్యూ డియర్. ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖా నిరోషా ముఖ్యపాత్రలో నటిస్తున్న ఈ సినిమాకి సుభాష్ ఆనంద్ సంగీతాన్ని అందించారు. ఈ మధ్యే ఈ సినిమా టీజర్ ను సెన్సేషనల్ డైరెక్టర్ వివి వినాయక్ లాంచ్ చేశారు. ఈ సినిమాలోని ఫస్ట్ సాంగ్ 'చిక్కక చిక్కిన గుమ్మ'ను రాకింగ్ స్టార్ మంచు మనోజ్ లాంచ్ చేశారు. ఈ పాటను నిర్మాత బాలాజీ రెడ్డి స్వయంగా రాయగా, శ్రీచరణ్ స్వరాన్ని అందించారు. మనోజ్ ఈ పాటకు బాగా కనెక్ట్ అయ్యారు. ఈ సాంగ్ ను అలాగే ఈ సినిమాను ప్రేక్షకులు కూడా ఆదరించాలని

# రామ్ చరణ్ అన్ బిలీవబుల్ మేకోవర్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'పెద్ది' కోసం తన బెస్ట్ ఎఫర్ట్స్ పెడుతున్నారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ పాన్-ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్ తో దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ కీలకమైన ఫేజ్ కి ముందు రామ్ చరణ్ ఈ పాత్ర కోసం నెవర్ బిఫోర్ అవతార్ లోకి మారారు. పవర్‌ఫుల్ లుక్‌కి ఫిట్ అవడానికి ఫిజికల్ గా ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. కంటిన్యూగా కసరత్తులు చేస్తూ, డెడికేషన్‌తో ఫిజిక్‌ను సాలిడ్ గా తీర్చిదిద్దుకున్నారు. జిమ్‌లో తీసిన ఫోటో చూస్తే... రగ్డ్ బీర్డ్, ముడివేసి వేసిన జుట్టు, స్ట్రాంగ్ బాడీతో లుక్ అదిరిపోయింది. ఈ మార్పు కేవలం లుక్ కోసమే కాదు, పాత్రపై అతని అంకితభావానికి నిదర్శనం. గ్రీక్ గాడ్ లా కనిపిస్తున్న చరణ్ రెగ్యులర్ మోడ్ వదిలేసి బీస్ట్ మోడ్‌లోకి ఫుల్ గా మారిపోయారు. చరణ్ పుట్టిన రోజైన మార్చి 27న విడుదల కానున్న పెద్ది, తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులలో ఒకటిగా ఇప్పటికే సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పుడు చరణ్ ఇంటెన్స్ ట్రైనింగ్ చేస్తుండడంతో, ఫ్యాన్స్ లో చాలా క్యూరియాసిటీ నెలకొంది. ఈ సినిమాలో కన్నడ సూపర్‌స్టార్ శివ రాజ్‌కుమార్ తో పాటు జాన్వి కపూర్ కథానాయికగా నటించగా, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# అలాంటి సీన్స్ అసలు చేయను: నిధి అగర్వాల్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో కలిసి నిధి అగర్వాల్ 'హరిహర వీరమల్లు' మూవీతో ముందుకొస్తోంది. గత కొన్నిరోజులుగా ఈ భామ ఈ సినిమా ప్రమోషన్స్ ను బుజానకేసుకుంది. సింగిల్ గా ప్రమోషన్స్ చేస్తూ బిజీగా ఉంటోంది. ఈ క్రమంలోనే తన గురించి ఈ ఆసక్తికరమైన విషయాన్ని షేర్ చేసుకుంది. తనకు మాస్ హీరోయిన్‌గా గుర్తింపు రావాలని ఉందని చెప్పిందీ బ్యూటీ. అయితే మాస్ ఇమేజ్ రావాలంటే బికినీ, లిప్‌లాక్, ఇంటిమేట్ సీన్స్ మాత్రం చేయనని.. తన లిమిట్స్ తనకు తెలుసని చెబుతోంది. తల్లిదండ్రులతో కలిసి చూడలేని సన్నివేశాల్లో అసలు నటించనని తెగేసి చెప్పింది. అలాంటి సీన్స్ చేయకపోయినా మాస్ హీరోయిన్ అవ్వొచ్చట. దాని కోసం తాను కష్టపడి పనిచేస్తానని, మంచి కథలు ఎంచుకోవడానికి ప్రయత్నిస్తానని చెబుతోంది నిధి అగర్వాల్. ఇక, 'హరిహర వీరమల్లు'లో క్యారెక్టర్ కోసం నిధి భరతనాట్యం, గుర్రపు స్వారీ వంటి వాటిలో ట్రైనింగ్ తీసుకుందట.

# సూపర్ స్టార్ కు శ్రీలంకలోనూ ఫ్యాన్ బేస్




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు క్రేజ్ ఎలాంటిదో అందరికీ తెలిసిందే. ఆయన నటించే సినిమాల కోసం ఫ్యాన్స్, ఆడియన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. మహేస్ బాబుతో ఒక్క ఫోటో అయినా దిగాలని అభిమానులు పడే ఆరాటం అంతా ఇంతా కాదు. అయితే మహేష్ బాబు క్రేజ్‌కు ఇండియాలోనే కాదు.. ఇతర దేశాల్లోనూ అభిమానులు ఉన్నారు. మహేష్ బాబు క్రేజ్ ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. లేటెస్ట్ గా శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విమానంలో హైదరాబాద్ నుంచి కొలంబోకి మహేష్ బాబు ప్రయాణించాడు.

తమ విమానంలో సౌత్ ఇండియా సినిమా ఐకాన్ ప్రయాణిస్తున్నారని తెలుసుకున్న సిబ్బంది మహేష్‌తో కలిసి ఫోటోలు దిగారు. దీనికి సంబంధించిన ఫోటోను ఆ ఎయిర్‌లైన్స్ తమ అధికారిక సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో మహేష్ బాబు అంటే ఆ మాత్రం క్రేజ్ ఉంటుందని అభిమానులు కాలర్ ఎగరేస్తున్నారు. ఇక ఈ ఫోటోలో మహేష్ అల్ట్రా స్టైలిష్ లుక్స్‌తో ఇరగదీశాడని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# హారర్ - కామెడీ మూవీలో వరుణ్ తేజ్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ #VT15. టాలెంటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్‌లో, UV క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో గ్రాండ్‌గా రూపొందుతోంది. ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్, ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌గా ఉండబోతోంది. హారర్- కామెడీ, ఇండియన్ & కొరియన్ బ్యాక్డ్రాప్, యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే ఇండియాతో పాటు, విదేశాల్లో మూడు మేజర్ షెడ్యూల్స్ కంప్లీట్ చేసి, గ్రాండ్ విజువల్స్‌ని క్యాప్చర్ చేశారు. షూటింగ్ చాలా స్పీడ్‌గా కంప్లీషన్ దిశగా వెళ్తోంది. ఈ మూవీకి థమన్ సంగీతం అందిస్తున్నారు. ఆయన కంపోజింగ్ సెషన్స్ శర వేగంగా జరుగుతున్నాయి. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్ - థమన్ కాంబో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ ఇవ్వబోతోంది. ఇందులో ఇప్పటికే రెండు ఎనర్జిటిక్ సాంగ్స్ షూట్ అయ్యాయి. ఇవి సినిమాకే హైలైట్స్ కానున్నాయి. త్వరలోనే టైటిల్, ఫస్ట్ గ్లింప్స్ అఫీషియల్‌గా రిలీజ్ చేయనున్నారు.

# రిషబ్ శెట్టి 'కాంతార చాప్టర్ 1' షూటింగ్ కంప్లీట్



రాజకుమార, కెజిఎఫ్, సలార్, కాంతార వంటి మైల్ స్టోన్ సినిమాలతో ప్రశంసలు పొందిన నిర్మాణ సంస్థ హొంబాలే ఫిల్మ్స్, ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లలో ఒకటైన కాంతార చాప్టర్ 1 ను రూపొందిస్తోంది. రిషబ్ శెట్టి మెయిన్ లీడ్ పోషించడమే కాకుండా డైరెక్షన్ కూడా చేస్తున్నారు. ఈ సినిమా ఇప్పటికే అద్భుతమైన ఫస్ట్ లుక్, బర్త్ డే స్పెషల్ పోస్టర్ తో ట్రెమండస్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంతార చాప్టర్ 1 మేకింగ్ వీడియోను విడుదల చేశారు. దాదాపు 250 రోజుల షూటింగ్, మూడు సంవత్సరాల కష్టం అంతా మిక్స్ అయిన ఈ వీడియో ఒక సినిమాటిక్ ఫెస్టివల్‌లా కనిపిస్తుంది. కేవలం బీహైండ్ ది సీన్స్ అనిపించకుండా సినిమా పుట్టిన తీరుని అద్భుతంగా చూపించారు. విభిన్న భూభాగాలు, కాంప్లెక్స్ సెటప్‌లలో పనిచేసే భారీ టీం కలిగి ఉన్న ఈ వీడియో రిషబ్ శెట్టి డెడికేషన్‌కు ట్రిబ్యూట్ లా వుంది. .అక్టోబర్ 2న గ్లోబల్ రిలీజ్ కానున్న ఈ సినిమా కన్నడ, హిందీ, తెలుగు, మలయాళం, తమిళం, బెంగాలీ, ఇంగ్లీష్ భాషల్లో రానుంది.

## ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ కు సత్కారం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి స్మృతి వనంనకు 6.8 ఎకరాలు సాధించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైవ్య వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ ను వీబీజీ ఫౌండర్ రాజు మడిపడిగె ఘనంగా సత్కరించి అభినందించారు. మంగళవారం హిమాయత్ నగర్ లోని వీబీజీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దూండి రాకేష్ కు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా వీబీజీ రాజు మడిపడిగె మాట్లాడుతూ దేశంలోనే ప్రపథమంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలకు శ్రీకారం చుట్టిన గొప్ప వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు. 58 రోజుల పాటు నిరహార దీక్షచేసి, రాష్ట్ర ఏర్పాటు కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఆయన అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వివిధ కార్యక్రమాల పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## మేడిపల్లి మండలం ప్రెస్ క్లబ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**మేడిపల్లి (ప్రశ్న న్యూస్)** జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గ ఉమ్మడి మేడిపల్లి మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళ వారం రోజున మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ కార్యాలయం ప్రారంభించారు.నాయకులకు ప్రజలకు మధ్య వారధిగా నిలిచి సమాజ సేవ చేసి సమాజంలో జరిగే మంచి చెడులను ప్రజలకు చేరవేస్తూ లాభాపేక్ష లేకుండా సమాజం కోసం పనిచేసే వారు పాత్రికేయలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చింతకింది లక్ష్మీపతి ఉపాధ్యక్షులు రహీం పుల్లూరి దేవయ్య ప్రధాన కార్యదర్శి మహేష్ ప్రచార కార్యదర్శి కుందారపు ప్రభాకర్ కోశాధికారి మల్లేశం గౌడ్ సహాయ కార్యదర్శి వజ్రలింగం సీనియర్ పాత్రికేయులు దయాకర్ ఆంజనేయులు దేవయ్య. రాంరెడ్డి, అశోక్, బక్కూరి నరేష్, దుమాల ప్రేమ కుమార్, గణేష్, రఫీ చిరంజీవి, గంగ నర్సయ్య సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు

## ధ్వని కాలుష్యంతో ఇబ్బంది పెడుతున్న యువకుడికి జరిమాన



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఎల్ఆర్ వెంచర్ లో గల ప్రజలకు టీఎస్ 13 ఈ 5992 అనే నెంబర్ గల కెటిఎమ్ ద్విచక్ర వాహనానికి బిగించిన అనధికార సైలెన్సర్ తో సౌండ్ చేస్తూ ఇబ్బంది పెడుతున్న రఫిక్ అనే యువకుడిని మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకొని మాడిఫై చేసిన సైలెన్సర్ ను తొలగించి రూ.3500 జరిమాన విధించారు. అనంతరం కౌన్సిలింగ్ కోసం మాదాపూర్ లోని టీటీఐకి పంపారు.

## మామిడి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర లభిస్తుంది



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** మామిడి రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా నిలిచిందని శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జయచంద్ర నాయుడు పత్రికాపూర్వకంగా తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జయచంద్ర నాయుడు మాట్లాడుతూ . ఉమ్మడిచిత్తూరుజిల్లాలో కూటమి ప్రభుత్వం మామిడి రైతులకు కిలోకు రూ.4 చొప్పున సబ్సిడీ ఇవ్వనున్నారనీ. రూ.150 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఇతర రాష్ట్రాలకు తరలించిన మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం మద్దతు ధర లభిస్తుంది తెలియజేశారు, రైతుబాంధవుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుమామిడి రైతుల పక్షాన నిలబడిన రైతులకు లబ్ధి చేకూరుస్తుందని తెలియజేశారు. ఈ సంవత్సరం అత్యధిక దిగుబడి రావడంతో మామిడి ధర తగ్గుముఖం పట్టింది. ఈ విషయాన్ని ముందే గ్రహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరియు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చిత్తూరు జిల్లాలో విస్తృతంగా పర్యటించి రైతులతో, పల్ప్ ఫ్యాక్టరీ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను సేకరించారు.దిగుబడి ఎక్కువ ఉండటంతో మామిడి పంటను పల్ప్ ఫ్యాక్టరీలు తక్కువ ధరకు అడుగుతున్నారని తెలుసుకున్న మరియు మంత్రి అచ్చెన్నాయుడు వెంటనే ఈ సమస్యను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు పల్ప్ ఫ్యాక్టరీలు కేజీ మామిడిని 8 రూ కొనాలని, 4 రూ సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తుందని తెలిపారు.

# రైల్వే ట్రాక్ సమీపంలోనే అక్రమ నిర్మాణాలు

**ఏలాంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణం**

**జీహెచ్ఎంసీ తీరుపై మండిపడుతున్న స్థానికుల**

**మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు**







మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడటం లేదు. అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల భవనాలు పుట్టుకొస్తున్నాయి. మల్కాజిగిరి, మౌలాలీ, నేరేడ్మెట్, గౌతమ్నగర్, వినాయక్నగర్, ఈస్ట్ ఆనంద్బాగ్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరొపిస్తున్నారు. కాకతీయనగర్ కాలనీలో రైల్వే ట్రాక్ కు సమీపంలోనే ఏలాంటి అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయనే ఆరొపనలున్నాయి.

### టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై మండిపాటు

మల్కాజ్గిరి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేవలం
నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల అక్రమ నిర్మాణదారులు మరింతగా రెచ్చిపోతున్నారని, నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టానుసారంగా కట్టడాలు చేపడుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు.

### ప్రమాదకరంగా మారుతున్న అక్రమ నిర్మాణాలు

ఈ అక్రమ నిర్మాణాల వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకు సందుల్లో, సరైన ప్రణాళిక లేకుండా నిర్మిస్తున్న ఈ భవనాల వల్ల ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులు, పారిశుధ్య సమస్యలు తీవ్రమవుతాయని పేర్కొంటున్నారు. అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అరికట్టాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# విద్యా వ్యవస్థలో ప్రజా ప్రభుత్వంలో పెను మార్పులు

- పేద ప్రజలకు ఉపయోగపడే ప్రతి పథకాన్ని అమలు చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- మేడిపల్లి మోడల్ స్కూల్ లో కిచెన్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన
- ప్రెస్ క్లబ్ కార్యాలయం ప్రారంభించిన విప్





**మేడిపల్లి (ప్రశ్న న్యూస్)** విద్యా వ్యవస్థలో ప్రజా ప్రభుత్వంలో పెను మార్పులు తీసుకువస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మేడిపల్లి మండలంలో పర్యటించారు.మేడిపల్లి మండలం పోరుమల్ల, కట్లకుంట, వల్లంపల్లి,మాచాపూర్ గ్రామాల్లో 60 లక్షలతో నూతన అంగన్వాడి భవనాలకు శంకుస్థాపన మాచాపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు..మేడిపల్లి మోడల్ స్కూల్ లో 10 లక్షలతో నిర్మిస్తున్న కిచన్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిపల్లి మండలానికి అనేక అంగన్వాడి భవనాలను భవనాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో పేద వారికి ఉన్నత విద్యా అందించడానికి చిన్న తనంలోనే చిన్నారులకు పౌష్టిక ఆహారం అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గురుకులంలో చదువుతున్న పిల్లలకు నాణ్యమైన విద్య, ఆహారం ఆందజేస్తున్నట్లు అందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యార్థులకు ఒకే రకమైన మెనూ ప్రకారం భోజనం అందజేయడం జరుగుతుందని తెలిపారు.. ప్రజా ప్రభుత్వంలో కాస్మోటిక్స్, డైట్ చార్జీలను పెంచడం జరిగిందని తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని అమలు చేశారని తద్వారా ఈ పథకం వలన ఎంతో మంది ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్య విధానంలో పెను మార్పులు చేస్తున్నారని, ఐటిఐ లను ఏటీసి లు మార్పు చేస్తున్నారని200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటిని ఎర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే మళ్ళీ ఇందిరమ్మ రాజ్యంలో పదకొండు సంవత్సరాలు తర్వాత డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టుల మంజూరు చేయడం జరిగిందని మేడిపల్లి మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయోధ్య పోరుమల్ల గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం చేపడతానని ఎన్నికల్లో హామీ ఇచ్చి మీ బిడ్డ గెలిచిన తర్వాత రోడ్డు మంజూరు చేయడం జరిగిందని రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

### మోడల్ స్కూల్ సందర్శన

మేడిపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ను రాష్ట్ర ప్రభుత్వ విప్ సందర్శించారు.. 10 లక్షలతో నిర్మిస్తున్న కిచన్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం విద్యార్థిని విద్యార్థుల కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వారితో కలసి భోజనం చేశారు. విద్యార్థి జీవితం ఎంతో ఉన్నతమైనదని ఈ రోజులు మళ్లీ జీవితంలో రావని తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు

# సమస్యల సాధనలో అరవై ఏండ్లుగా అలుపెరగని పోరాటాలు

**(తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ వజ్రోత్సవాలు)**








**నాచారం (ప్రశ్న న్యూస్)** ఉద్యమాల పునాధులపై పురుడు పోసుకొని అలుపెరగని పోరాటాలతో ఎన్నో విజయాలను సొంతం చేసుకొని వైద్యరంగ ప్రభుత్వ సంస్థల్లో గత అరవై సంవత్సరాల నుండి ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘంగా ఉన్న ఎ.ఐ.టి.యు.సి అనుబంధ సంఘమైన తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ వజ్రోత్సవాలు ఘనంగా ప్రారంభమైన్నాయి. నాచారం లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో మంగళవారం నాడు తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్ - 1725) వజ్రోత్సవాలను లాచంనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎ.ఐ.టి.యు.సి రాష్ట్ర అద్యక్షులు, టీ.జీ.యం.ఈ.యూ గౌరవ అధ్యక్షులు మహ్మద్ యూసుఫ్ మాట్లాడుతు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అలుపెరగని పోరాటాలతో ప్రభుత్వం మెడలు వంచి ఎన్నో విజయాలను సొంతం చేసుకొన్న ఏకైక సంఘం తెలంగాణ మెడికల్ ఎంప్లాయూస్ యూనియన్ అని అన్నారు. సమస్యల సాధనలో ఎర్రజెండా నీడనే శ్రీరామ రక్ష అని అన్నారు.


రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వేణుకుమార్ మాట్లాడుతు ఉద్యోగుల సమస్యల సాధనలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కు ఏ సంఘం సాటిరాదని, నర్సింగ్ సిబ్బంది పదోన్నతులు, క్యాడర్ పేరు మార్పుపై అలుపెరగని ఉద్యమాలతో విజయం సాదించామని తెలిపారు. అలాగే ఈఎస్ఐ లో నేటికి అపరిష్కృతగా ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటు ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన మన యూనియన్ నేడు వజ్రోత్సవాలు జరుపుకుంటున్న వేళ ప్రతి సభ్యుడు గర్వించదగ్గ సమయమని ఈ సందర్భంల్లో యూనియన్ నాయకులు, సభ్యులకు అభినందనలు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్. మూర్తి మాట్లాడుతు తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏ ఒక్క క్యాడర్ కు సంబందించింది కాదని అన్ని క్యాడర్ల సిబ్బంది సభ్యులుగా ఉన్న తమ యూనియన్ అన్ని వర్గాల ఉద్యోగుల సమస్యలపై పోరాడుతుందని తెలిపారు. దేశంలో మరే ఇతర కార్మిక సంఘం సాధించని ఘనత మన తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (%ఎ%-1725) సాధించిందని, అన్ని కేటగిరీలకు చెందిన ఉద్యోగులు సమస్యలపై పోరాటాలలో కలిసికట్టుగా తమ మద్దత్తును ప్రకటించడైతోనే విజయాన్ని సాధించామని అన్నారు.

### ఉద్యమాలతో సాధించిన విజయాలు

1953 వ సంవత్సరంలో స్థాపించి క్యూరేటివ్ వింగ్ లోని వైద్యవిద్య, ఈఎస్ఐ, ప్రివెంటివ్ మెడిసిన్, వైద్య విధాన పరిషత్ సంస్థల్లో 1965వ సంవత్సరంలో మొట్ట మొదటిగా ప్రభుత్వ గుర్తింపు పొంది, ఉద్యోగులకు ఎన్నో విజయాలు సాధించి పెట్టింది. ఇందులో ముఖ్యంగా డైలీవేజెస్ పై నియమించిన వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు, డాక్టర్ల నుంచి వార్డు సిబ్బంది వరకు వారి సర్వీసులు క్రమబద్ధీకరింప జేయడం, ప్రభుత్వం కుట్ర పూర్వకంగా వైద్యవిద్య డైరెక్టర్ (డియంఈ) పరిధి లోని సంస్థలను దేవాలయ కమిటీలకు బదిలీ చేయడాన్ని నిరసించి, పోరాడి అడ్డుకున్నది. నేటికీ అపరిష్కృతంగా ఉన్న ఈ.ఎస్.ఐ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతు, ఉద్యోగుల సర్వీసు కండిషన్స్ మెరుగు పరచడం కోసం అలుపెరుగని పోరాటాలు చేసి, విజయాలు సాధించి పెట్టింది. ప్రస్తుత పరిస్థితుల్లో మనకు కొన్ని ఇబ్బందులు కలిగినప్పటికీ మొక్కఓని పట్టుదలతో యూనియన్ నిర్మాణం బలోపేతం చేసుకుని ముందుకు సాగుదామని నాయకులు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గోన్నారు.

# ఏడు ఫీట్ల రోడ్డు కబ్జా

- మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి నా ఇష్టం వచ్చినట్టు కట్టుకుంటాను
- కమిషనర్ కు ఫిర్యాదు చేసిన వినాయక నగర్ కాలనీవాసులు
- అక్రమ నిర్మాణాన్ని పరిశీలించిన టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రాధాకృష్ణారెడ్డి
- అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలి : మండల రవికుమార్, వినాయక్ నగర్ కాలనీ నివాసి





**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)**ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా ఫుట్ పాత్ రోడ్డును ఏడు ఫీట్లు కబ్జా చేసి సదరు స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్న అక్రమ నిర్మాణదారుడిపై చర్యలు తీసుకోవాలని గత శనివారం మేడ్చల్ పురపాలక సంఘం కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డిని వినాయక నగర్ కాలనీవాసులు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

### మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి నా ఇష్టం వచ్చినట్టు కట్టుకుంటాను

రోడ్డు కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న విషయంపై సదరు అక్రమ నిర్మాణదారున్ని కాలనీవాసులు ప్రశ్నించగా మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి నా ఇష్టం వచ్చినట్టు కట్టుకుంటాను అని పురపాలక సంఘం అధికారులతో, కాలనీవాసులతో మాట్లాడుతున్నట్టు ఫిర్యాదులో కాలనీవాసులు పేర్కొన్నారు.

### అక్రమ నిర్మాణాన్ని పరిశీలించిన టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రాధాకృష్ణారెడ్డి :

ఏడు ఫీట్లు కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న విషయంపై కాలనీవాసులు కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డికి ఫిర్యాదు చేయగా కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రాధాకృష్ణ రెడ్డి సదరు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించారు.

### అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి : మండల రవికుమార్, వినాయక్ నగర్ కాలనీ నివాసి

మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని వినాయక నగర్ కాలనీలోని రోడ్ నెంబర్ 1లో ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాన్ని అధికారులు వెంటనే కూల్చివేయాలి. లేదంటే పురపాలక సంఘం కార్యాలయం ముందు కాలనీవాసులతో ధర్నా చేస్తాం పని హెచ్చరించారు. ఇలా రోడ్డు కబ్జా చేయడం వల్ల వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది అవుతుందని, ఎవరు పడితే వారు రోడ్డు కబ్జా చేస్తే భవిష్యత్తులో రోడ్డు లేకుండా పోతాయని దీనిపై వెంటనే కమిషనర్ స్పందించి రోడ్డు కబ్జాను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఈడీని సమయం కోరిన రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి

- నలుగురికి నోటీసులు జారీ చేసిన ఈడీ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బెట్టింగ్ యాప్‌ల కేసు విచారణకు హాజరయ్యేందుకు సినీ నటులు రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి ఈడీని గడువు కోరారు. బెట్టింగ్ యాప్‌ల కేసులో విచారణకు హాజరు కావాలని వీరితో పాటు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండలకు కూడా ఈడీ నోటీసులు జారీ చేసింది. నేడు రానా దగ్గుబాటి విచారణకు హాజరు కావాల్సి ఉండగా, షూటింగ్ నిమిత్తం సమయం కావాలని ఆయన కోరారు. షూటింగ్ బిజీ కారణంగా తన షెడ్యూల్‌ను మార్చాలని విజ్ఞప్తి చేశారు. మంచు లక్ష్మి ఆగస్టు 13న ఈడీ అధికారుల ముందు హాజరు కావాల్సి ఉంది. అయితే, తాను కూడా ఆ రోజు హాజరు కాలేనని మంచు లక్ష్మి ఈడీకి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ప్రకాశ్ రాజ్ జులై 30న, విజయ్ దేవరకొండ ఆగస్టు 6న ఈడీ ఎదుట హాజరు కావాల్సి ఉంది. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై గతంలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేస్తోంది. పంజాగుట్ట, మియాపూర్, సూర్యాపేట, విశాఖపట్నంలో నమోదైన కేసుల ఆధారంగా విచారణ జరుపుతోంది. 29 మంది సినీ నటులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఈడీ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదు చేసింది.

# మెట్ పల్లి క్లబ్ ఆస్తిపై కన్నేసిన ఘనులు

## - వాస్తవ విలువ కంటే కోట్లు తక్కువకు విక్రయం.?

- ఎంతో మంది అమాయకులు పుస్తెలమ్మి ఆస్తులు పోగొట్టుకున్నారు
- పెద్ద మనుషులు పెద్ద మనుషులుగా ఎదిగారు
- మేము చెప్పిందే వేదం అన్నట్టుగా మెట్ పల్లి రాజకీయాన్ని కొన్ని ఏళ్లు శాసించిన ఈ క్లబ్బు పెద్దమనుషులు





**మెట్ పల్లి (ప్రశ్న న్యూస్)** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ మెట్ పల్లి పట్టణంలో దాదాపు 50 సంవత్సరాల క్రితం కొంత మంది ఊరి పెద్ద మనుషులు, కాంట్రాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఒక సమూహం గా ఏర్పడి మెట్ పల్లి క్లబ్ పేరిట ఒక పేకాట క్లబ్ ను ఏర్పరిచారు. మొదట్లో అది అద్దెభవనంలో కొనసాగింది, కాలక్రమేణా జూదరులు పెరగడం, అప్పట్లో పెద్దగా ప్రభుత్వ ఆంక్షలు లేకపోవడంతో అట్టి క్లబ్ ఆదాయానికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఇంతింతై వటుడింతై అన్న చందంగా స్వంత భవన నిర్మాణానికి దాదాపు అర ఎకరం స్థలం కొనుగోలు చేసి అందులో విలాసవంతమైన భవనాన్ని నిర్మించారు, ఆ తర్వాత నూతన భవనం ప్రారంభమైన అనంతరం అట్టి క్లబ్ యొక్క మెంబర్ షిప్ కోసం జూదరులు పోటీపడి మరీ వారు అడిగినంత చెల్లించి క్లబ్ సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వం తీసుకున్న వారిలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కూడా ఉన్నారు. ఇలా ఏ రాజకీయ పార్టీలు అధికారంలోకి వస్తే ఆయా పార్టీల ఎమ్మెల్యే లను గౌరవ అధ్యక్షులుగా చేస్తూ వాళ్ళ అడుగులకు మడుగులొత్తుతూ తమ పేకాట ను నిర్విఘ్నంగా నిర్వహించారు.

### అధికారులను ప్రజలను పోలీసులను నమ్మబలికి

ఇది ఇలా నడుస్తున్న నేపద్యంలో క్లబ్ లో పేకాట కారణంగా ఎంతో మంది తమ ఆస్తులను పోగొట్టుకుంటున్నారని కొందరు స్థానికులు అప్పట్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు . ఇది గమనించిన క్లబ్ యాజమాన్యం ఇది కేవలం పేకాట కోసమే పుట్టిన క్లబ్ కాదని ప్రభుత్వాన్ని ప్రజలను నమ్మించడం కోసం దక్షిణ భారత ఖోఖో పోటీలను సైతం నిర్వహించారు. దీనిని నమ్మి గతంలో ఎమ్మెల్యే గా పని చేసిన ఒక నాయకుడు ఆ క్లబ్లో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ను నిర్మించడానికి ఏకంగా ప్రభుత్వ నిధులను కూడా మంజూరు చేశారు. ఇలా జూదరుల సొమ్మే కాకుండా ప్రభుత్వ నిధులు కూడా క్లబ్ ను ముంచెత్తినాయి,ఆ తరువాతి కాలంలో వెంకట్రావు పేట లో ఒక ఎకరం స్థలం కూడా క్లబ్ యొక్క ఆస్తిలో చేరింది. క్లబ్ కు ఆస్తులు పెరుగుతున్నాయి కానీ అందులో జూదం ఆడుతూ ఎందరో తమ ఆస్తులు అమ్ముకుని తమ జీవితాలను అర్ధాంతరంగా ముగించిన సందర్భాలున్నాయి. ఎప్పుడో డెబ్బయవ దశకంలో కొందరి చేతుల మీదుగా ఏర్పడ్డ క్లబ్ కు క్రమేపీ నాలుగు వందల మంది సభ్యుల దాకా ఏర్పడ్డారు. మొట్ట మొదటగా స్థాపించిన వారందరూ దాదాపు గా చనిపోయారు. ఇక మిగిలిన వారు కొందరు 186 మందిగా ఉన్నట్లు గా సమాచారం.

### స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు హయాంలో పేకాట క్లబ్బు పై చర్యలు




ఇదిలా ఉండగా 2004లో మెట్ పల్లి ఎమ్మెల్యే స్వర్గీయ కొమిరెడ్డి రాములు ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మెట్ పల్లి లో ఇలాంటి పేకాట క్లబ్బులు ఉండవద్దు కొందరు భార్య మెడలో నీ 'పుస్తెలు అమ్ముకొని ఈ పేకాట క్లబ్ లో జీవితాలు నాశనం చేసుకున్నారని ఎంతోమంది అమాయకులు పెద్ద మనుషులు ఈ పేకాట క్లబ్లో జూదమాడి అప్పుల పాలైనారని అని తెలుసుకొని ఈ క్లబ్ పై కఠిన చర్యలు తీసుకొని ఎవరిని కూడా ఇక్కడ జూదం ఆడకుండా కట్టడి చేశారు అనంతరం ఈ ప్రాంతం నుండి గెలిచిన ఎమ్మెల్యే ఈ క్లబ్ లోని పెద్ద మనుషులు ఎలాగైన చేసి ఈ క్లబ్ ను తెరిపించాలని చాలా ప్రయత్నాలు చేశారు ఇది ఇలా ఉండగా 2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని పేకాట క్లబ్బులు పై ఉక్కుపాదం మోపి ఇలాంటి క్లబ్ లను మూసి వేయించింది. ఎప్పటికైనా క్లబ్బు తెరుచుకుంటాయని ఆశించిన జూదరుల ఆశలు ఆడియాసలయ్యాయి. ప్రభుత్వం మారితే ఖచ్చితంగా పేకాట ను ప్రోత్సహిస్తుంది అని అంతా అనుకున్నారు. కానీ ఇటీవల ఏర్పడిన ప్రజా ప్రభుత్వం కూడా వారి ఆశలపై నీళ్లు చల్లింది. ఇక ఎట్టి పరిస్థితుల్లో క్లబ్ తెరుచుకోదని భావించిన కొందరు మెంబర్లు దీనిని అమ్మి సొమ్ము చేసుకుందామని భావించి ఒక సిండికేట్ గా ఒక ట్రస్టు గా ఏర్పడి ఈ క్లబ్బు ను అమ్మివేస్తామని కనీస ధర గజానికి 20000 రూపాయలు గా నిర్ణయించి దానికంటే ఎక్కువగా టెండర్ వేసిన వారికి అమ్ముతామని స్థానిక వాట్సాప్ గ్రూపుల లో టెండర్ నోటిఫికేషన్ ప్రచురించారు . ఈ టెండర్లలో కూడా అమాయకులైన కొందరిని ఎంచుకుని మీకు కొంత కమీషన్ ఇస్తామని వారిని ఇట్టి సిండికేట్ సభ్యులు బినామీలుగా మలుచుకొని టెండర్లు వేయించడం జరిగింది. ఇరువైవేలు కనీస ధర గా ప్రచురించిన తర్వాత ముగ్గురు టెండర్లు వేశారని వారిలో అత్యధిక ధరకు షికారి రాము అనే ఫోటో గ్రాఫర్ 20025 రూపాయలకు టెండర్ వేశాడని అతనికే టెండర్ ఖరారు చేస్తున్నామని ప్రకటించారు. 1865 చదరపు గజాలకు గాను దాదాపు 3 కోట్ల 75 లక్షలకు అమ్ముడైనట్లు తెలిపారు.

### గజానికి 30,000 ఉంటే 20 వేలకే అమ్మకం

కాని పట్టణం లోని క్లబ్ ప్రాంతంలో ప్రస్తుతం గజానికి దాదాపుగా ముప్పై వేలు పలుకుతుంది. అంటే ఇట్టి సిండికేట్ సభ్యులు అసలు ధర కన్నా రెండు కోట్లు తక్కువగా కోరుట్ల పట్టణానికి చెందిన కొందరు పెద్ద మనుషులతో టెండర్లు వేయించారని తెలుస్తోంది. మొత్తానికి టెండర్ స్టేజీలోనే 2 కోట్లు కొట్టేయడానికి రంగం సిద్ధం చేశారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బు వచ్చిపడు తుందని తెలుసుకున్న మరణించిన సభ్యుల కుటుంబ సభ్యులు అందులో తమకు వాటా కావాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలియవచ్చింది. ఇదిలా ఉంటే క్లబ్ అనేది ఏ ఒక్కరి స్వంత ఆస్తికాదని అందులో ఎందరో ప్రజల కన్నీటి గాథలున్నాయని మరియు క్లబ్ ను ప్రభుత్వ నిధులతో డెవలప్మెంట్ చేసారని, అక్రమంగా అన్యాక్రాంతమవుతున్న కోట్లాది రూపాయల ఆస్తిపై కలెక్టర్ స్పందించి దానిపై విచారణ జరిపించి పట్టణ ప్రజలందరికి హక్కులు కల్పించేలా ప్రభుత్వ పరం చేసుకుని స్థానిక మునిసిపల్ కార్యాలయానికి చెందేట్లుగా చెయ్యాలని స్థానికులు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది.

# విమానాల స్విచ్‌లలో ఎలాంటి సమస్యను గుర్తించలేదు

- డీజీసీఏ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టిన ఎయిరిండియా




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఎయిరిండియా సంస్థ తమ విమానాల్లోని ఇంధన స్విచ్‌ల వ్యవస్థలపై ప్రకటన విడుదల చేసింది. తమ వద్ద ఉన్న బోయింగ్ 787, 737 విమానాల ఇంధన స్విచ్‌ల లాకింగ్ వ్యవస్థల్లో ఎలాంటి సమస్యలను గుర్తించలేదని ఆ ప్రకటనలో పేర్కొంది. గత నెలలో అహ్మదాబాద్‌లో ఇంధన స్విచ్‌ల కారణంగా ఒక విమానం కూలిన సంఘటన నేపథ్యంలో, డీజీసీఏ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపింది. ం

భారతదేశంలో రిజిస్టర్ అయిన బోయింగ్ విమానాలన్నింటిలో జులై చివరి నాటికి ఈ తనిఖీలు పూర్తి చేయాలని డీజీసీఏ ఆదేశించింది. ఈ నేపథ్యంలో తనిఖీలు చేపట్టిన ఎయిరిండియా సంస్థ, బోయింగ్ విమానాల ఇంధన స్విచ్‌ల లాకింగ్ వ్యవస్థల్లో ముందు జాగ్రత్త చర్యగా చేపట్టిని తనిఖీలను పూర్తి చేసినట్లు తెలిపింది. ఈ తనిఖీలలో ఎటువంటి సమస్యను గుర్తించలేదని స్పష్టం చేసింది. జులై 12న ప్రారంభమైన ఈ తనిఖీలు, డీజీసీఏ సూచించిన గడువులోగా పూర్తయ్యాయని, ఈ విషయాన్ని డీజీసీఏకు తెలియజేసినట్లు ఎయిరిండియా వెల్లడించింది.

# రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

## గోదాం నిర్వాహకులకు నోటీసులు అందజేస్తాం

## ఆలయంలోకి వర్షపు నీరు రాకుండా శాశ్వత పరిష్కారం



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** మేడ్చల్ మున్సిపల్ పరిధి కిష్టాపూర్ లో ముంపునకు గురైన శ్రీ రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ దేవాలయాన్ని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షం నీటితో పాటు ఆలయం పక్కనే ఉన్న ఓ గోదాం నుండి వచ్చే మురికి నీటితో ఆలయ ప్రాంగణం లోకి భారీ ఎత్తున నీరు చేరింది అంటూ "ప్రజా ప్రశ్న" దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి మున్సిపల్ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. ప్రస్తుతం దేవాలయ ప్రాంగణంలో నిలిచిన నీటిని తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలోకి వరద నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చేపడతామని, ఇందుకు ప్రణాళికలు సైతం సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. దేవాలయం పక్కన ఉన్న గోదాం నుండి వచ్చే మురికి నీటిని ఆలయ ప్రాంగణంలో లోకి రాకుండా చర్యలు తీసుకుంటామని, మొదట గోదాం నిర్వాహకులకు నోటీసులు అందజేస్తామని తెలిపారు. గోదాం నుండి వచ్చే మురికినీటిని తరలించుకునేందుకు వేరే ఏర్పాట్లు చేసుకోవాలని, ఆలయ ప్రాంగణంలోకి మురికినీరు ఎట్టి పరిస్థితిలో రావద్దని గోదాం యజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిటీ సభ్యులు సిఏ నవీన్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, పరశురాం, వేముల రాజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు యాదయ్య, బిఆర్ఎస్ నాయకులు వెంకటేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.


ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
ముంపున కు గురైన
శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం




Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588